
# డర్టీ డెవిల్స్

మధుబాబు



MVS PUBLICATIONS

# డర్టీ డెవిల్స్

"మిస్టర్ షాడో, ఇంతవరకూ ఎవరికీ చిక్కకుండా తప్పించుకు తిరిగావ్. వెంటాడిన వారిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించావ్. ఈ రోజుతో నీ ఆట కట్టింది. ఈ క్షణంతో నీ ఆయువు చెల్లిపోయింది. యువార్ గోయింగ్ టు డై మై డియర్ షాడో....."

కనుచివరలనుంచి మాటలు వినవచ్చిన దిశకు చూశాడు షాడో. ప్రక్కసీటులో కూర్చుని వున్నాడొక ఆజానుబాహుడు. అతని కోటుజేబులో నుండి ఆకలిగా షాడో వైపు చూస్తున్నది 35 కాలిబర్ పిస్టల్ ఒకటి.

షాడో తనవైపు చూడడం గమనించాడా వ్యక్తి, హుందాగా, గర్వంగా నవ్వాడు.

చూపును మరల్చుకున్నాడు షాడో. ఎదుటి సీటులో ఇద్దరు యువకులు కూర్చుని వున్నారు. వెనక్కి చూడటం లేదు వారిద్దరూ కాని.... వారి దుస్తుల చాటునుంచి రెండు రివాల్వర్లు షాడోకేసి గురిపెట్టబడివున్నాయి. వెనక్కి చూశాడు షాడో, వెనుక సీటులో యిద్దరు మధ్య వయస్కులు వున్నారు. వారి చేతుల్లో గుండ్రంగా చుట్టిన వార్తాపత్రికలున్నాయి. ఆ చుట్టలలో యిమిడి వున్న రివాల్వర్లు షాడో వైపే చూస్తూ వున్నాయి.

"చూశావ్‌గా మై డియర్ షాడో..... మా చక్ర బంధం నుంచి నువ్వు ప్రాణాలతో బయటపడలేవు. విమానం సిక్కిం ఎయిర్‌పోర్టులో దిగిన మరుక్షణం నీ ఆత్మ అంతరిక్షం లోకి లేస్తుంది. నీ పని అయిపోయింది.... యువార్ ఫినిష్డ్ మిస్టర్ షాడో....."

షాడోను గమనిస్తున్న ఆ ఆజానుబాహుడు మరోసారి మెల్లగా అన్నాడు.

నిర్వికారంగా సీటుకు తల ఆనించి కూర్చున్నాడు షాడో. పనామా పాకెట్ తీసి సిగరెట్‌ని వెలిగించుకున్నాడు.

ఎక్కడో పొరపాటు జరిగింది. తను సిక్కిం బయలుదేరుతున్నట్లు కిల్లర్స్ గాంగ్‌కి తెలిసింది.... చేతికి అందిన అవకాశాన్ని జార విడుచుకోదు కిల్లర్స్ గాంగ్...... తన కిల్లర్స్‌ని వుసిగొల్పింది. ఉచ్చు ముడి షాడో మెడ చుట్టూ బిగిసుకోబోతున్నది.

సిక్కిం.... భారతదేశంలో విలీనమైన క్షణం నుంచీ, అక్కడ విద్రోహకర చర్యలను ప్రారంభించింది కిల్లర్స్ గాంగ్. అందుకు మద్దతును యిస్తోంది చైనా ప్రభుత్వం. సిక్కిం ప్రజలకు ఏదో అన్యాయం జరిగిందని ప్రచారం చేసి.... వారిని ఎగద్రోసి కల్లోలాలను సృష్టిస్తోంది.

ఆ కల్లోలాలను అణచాలంటే.... వాటి వెనుక వున్న చేతులను తెగనరకటమే మంచి మార్గం. అంతకంటే వేరు దారి లేదు.

అందుకే సి.ఐ.బి చేతుల్లో ఆ కార్యభారాన్ని వదిలి.... చేతులు దులుపుకున్నారు అందరూ. ఆ విషయం.... బైటకు పొక్కింది.... ఎలా అనేది అప్రస్తుతం.

కిల్లర్స్ గాంగ్ షాడోను అనుసరించింది..... మాటు వేసి చుట్టు ముట్టింది, మట్టుపెట్టడానికి సిద్ధంగా వున్నది.

"లేడీస్ అండ్ జంటిల్మన్. ఇంకో పది నిముషాలలో కాంటాక్ ఎయిర్‌పోర్టులో దిగుతాం సిద్ధంగా వుండండి" పైలట్ కాబిన్‌కు పోయే దారి ముందు అమర్చిన స్పీకర్ మృదువుగా ఎనౌన్స్ చేసింది.

ఆలోచనలలో నుండి బయటపడి.... సేఫ్టీ బెల్టును నడుము చుట్టూ బిగించుకున్నాడు షాడో.

విమానం కాంటాక్ ఎయిర్‌పోర్టు మీద ఒక రౌండు కొట్టి ఏటవాలుగా రన్ వే మీదికి దిగటం ప్రారంభించింది.

షాడో చుట్టూ కూర్చున్న వారిలో టెన్షన్ ఎక్కువైంది. తమ తమ ఆయుధాలను బిగించి పట్టుకుని....రెడీగా కూర్చున్నారు.

మడిచిపెట్టి పట్టుకున్న వాచి స్ప్రింగులా వున్నాడు షాడో.... అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. విమానం నేలకు దిగగానే, ప్రయాణికులు లేచి నిలబడిన మరుక్షణం తన మీద విరుచుకుపడతారు వారు.

లగేజి కంపార్టుమెంటులో నుంచి యువతలకు వచ్చి పైలట్ కాబిన్ వైపు వెళుతున్న ది ఎయిర్ హోస్టెస్...... విమానం ఆగగానే ముందుకుపోయి తలుపు తెరిచి ప్రయాణీకులకు వీడ్కోలు యిస్తుంది.

విమానం నేలను తాకింది. టైర్లు కీచుమని రొద చేశాయి.... వేగంగా రెండు వందల గజాల దూరం పరుగెత్తి.... మెల్లిగా ఎయిర్‌పోర్టు బిల్డింగుల ముందు ఆగబోతున్న ది.

ఎయిర్ హోస్టెస్ తన ప్రక్కకు రాగానే "మిస్!" అన్నా డు షాడో.

"వాట్ సర్?" అంటూ షాడో వంక చూసిందామె.

"మిస్.... నాకేమిటో అవుతున్న ది.... నా గుండె ఆగిపోతున్న ట్లు అనిపిస్తోంది...." బాధగా ముఖం పెట్టి హీనస్వరంతో అన్నా డు షాడో.

చటుక్కున షాడో చేయి పట్టుకొని ప్రక్కన కూర్చున్న దామె. భుజంమీద చెయ్యి వేసి "డోన్ట్ వర్రీ సర్.... మరేం భయం లేదు.... మనం సురక్షితంగా కాంటాక్ చేరుకున్నాం. విమానం ఆగగానే డాక్టర్ని పిలిపించి మీకు మంచి ట్రీట్‌మెంట్ యిప్పిస్తాం..... భయపడకండి..... ధైర్యంగా వుండండి." అని ధైర్యం చెప్ప సాగింది.

విమానం ఆగబోతున్న ది. కిల్లర్స్ గాంగ్ మనుష్యులు సీట్లలోనుంచి లేచే ప్రయత్నా లు చేస్తున్నా రు. విమానం క్రిందికి దిగేముందు నడుములకు కట్టుకున్న సేఫ్టీ బెల్టులను వూడతీసుకుంటున్నా రు.

"అమ్మా.. అబ్బా!" అంటూ ఎయిర్ హోస్టెస్ భుజం మీద తల ఆనించి బాధతో మెలికలు తిరిగిపోసాగాడు షాడో.

ఆ కదలికల్లోనే.... అతని ఎడమ చేయి.....నడుముకు వున్న సేఫ్టీ బెల్టును తొలగించి వేసింది.

విమానం ఆగింది.

"జెస్ట్ ఎ మినిట్ సార్.... క్షణంలో వచ్చేస్తాను...." అంటూ లేవబోయింది ఎయిర్ హోస్టెస్.

ఆమెకన్నా ముందు మెరుపులా లేచాడు షాడో. ఆమెను సీటులోకి నెట్టి మలుపు దగ్గరకు పరుగు తీశాడు.

"పారిపోతున్నా డు.....పట్టుకోండి..... చంపండి...." అని అరుస్తూ హడావుడిగా సీట్లలోనుంచి లేచాడు కిల్లర్స్ గాంగ్ వస్తాదులు.

అప్పుడే పైలట్..... డోర్‌ని బిగించి వున్న ఆటోమెటిక్ లాక్‌ని రిలీజ్ చేశాడు. షాడో హేండిల్ మీద చేయి వేయగానే తలుపు తెరుచుకున్న ది.

స్టెయిర్ కేస్ ఇంకా తగిలించలేదు. దిగాలంటే పదిహేను అడుగులు క్రిందికి దూకాలి.

వెనకాముందూ చూడకుండా కిందికి దూకేశాడు షాడో.

అదే సమయంలో ఒక వస్తాదు తలుపు దగ్గరికి వచ్చాడు. అతని చేతిలోని రివాల్వరు.... పొగలు కక్కింది. దాని బుల్లెట్ షాడో భుజాన్ని రాచుకుంటూ పోయింది.

ఆగలేదు షాడో.... విమానాశ్రయపు అధికారులు... అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. అసలు విషయం వారికి అర్థం కాకముందే రన్‌వే మీది నుంచి విజిటర్స్ గాలరీలోకి వచ్చాడు.

విమానంలో కలకలం చెలరేగింది. ఎయిర్ హోస్టెస్ అరిచిన అరుపులకు ప్రయాణీకులలో చలనం వచ్చి వారు కూడా అరవటం ప్రారంభించారు.

షాడో వచ్చిన మార్గాన్నే అనుసరించారు కిల్లర్స్ గాంగ్ వస్తాదులు. విమానంలోనుంచి క్రిందికి దూకి వేగంగా షాడోని వెన్నంటారు.

రివాల్వర్ బుల్లెట్స్ షాడో చుట్టూ కందిరీగలలా ఎగరటం ప్రారంభించాయి. విమానాశ్రయంలో గందరగోళం స్టార్టు అయ్యింది.

సెక్యూరిటీ అధికారులు అటూ, ఇటూ పరుగులు తీయటం ప్రారంభించారు. వారు తనను రక్షించలేరని షాడోకు తెలుసు. కిల్లర్సు గాంగ్ మనుషులకు తాము పట్టుబడతామన్న భయం లేదు. వారి ధ్యేయం ఒక్కటే. షాడోని చంపాలి.

విజిటర్స్ గాలరీ ముఖద్వారం వైపు పరిగెత్తిన షాడో మెట్ల దగ్గిర నిలబడి వున్న పదిమంది వ్యక్తులను చూసి గిరుక్కున ప్రక్కకు తిరిగాడు.

కిల్లర్స్ గాంగ్ ఈ సారి పూర్తి కట్టుదిట్టాలతో కదిలినట్లుంది. ఎయిర్‌పోర్టులో షాడో కోసం సిద్ధంగా ఉన్నారు మరి కొంతమంది.

లావెటరీ, బాత్‌రూంల వైపు పరుగు తీశాడు షాడో ఉన్నట్లుండి బాత్‌రూమ్‌లలో నుంచి నలుగురు వ్యక్తులు బయటకు వచ్చారు. వారి చేతుల్లో ఆర్మీ రివాల్వర్లున్నాయి.

వాటి శబ్దాలతో విజిటర్స్ గాలరీ దద్దరిల్లి పోయింది. నున్నటి పాలరాతి గచ్చు మీద షాడో పాదాలు అనుకొన్న చోట ఆగలేకపోయాయి. కాలుజారి ఒక చోట బోర్లాపడ్డాడు. లేచేసరికి ఒక్క క్షణం ఆలస్యమయింది. ఆ ఒక్క క్షణాన్నీ ఆసరగా తీసుకుని రెండు రివాల్వర్లు తమ బుల్లెట్లను గురి తప్పకుండా వదిలాయి.

షాడో ఎడమచేయి చచ్చుబడిపోయింది. బుల్లెట్ చేసిన రంధ్రంలో నుంచి రక్తం వెల్లువలా ప్రవహించటం ప్రారంభించింది. రెండవ బుల్లెట్ ఎడమ తొడ మీద అరంగుళం లోతున గాటు పెట్టింది.

షాడో కళ్ళ ముందు ఇంద్రధనుస్సులు కనబడటం ప్రారంభించాయి. ఆగితే - అంతే.....తిరిగి వెలుగును చూడటమనే ప్రసక్తే లేదు.

పళ్ళ బిగువున ముందుకు పరుగు తీశాడు.

వెనకనుంచి అరుపులు..... రివాల్వర్ మోతలు వినవస్తున్నాయి.

షాడో మనస్సు ఆలోచించే శక్తిని కోల్పోవటం ప్రారంభించింది. అతను అడుగుపెట్టిన ప్రదేశమంతా రక్తపు మడుగులు ప్రత్యక్షమౌతున్నాయి.

ఎదురుగా ఒక మలుపు కనిపించింది. ఆ మలుపు చాటున ఆగి.... తనతోపాటు మరి కొంతమంది కిల్లర్స్ గాంగ్ వస్తాదులను పైకి తీసుకుపోదామన్న నిశ్చయం షాడో మనస్సులో బలపడింది.

బెల్టు వెనుక వున్న రివాల్వర్ ని బయటకు తీసి అటు పరుగెత్తాడు.

బాత్‌రూమ్‌లలో దాక్కుని.... షాడోని ఆశ్చర్య పరిచిన నలుగురూ..... అతి సమీపంలోకి వచ్చారు.

షాడో తలుపు చాటుకు చేరుకోబోతుండగా మరో బుల్లెట్ వచ్చి మళ్ళీ ఎడమ చేతిలో దిగబడింది.

షాడో ముఖమంతా చెమటతో నిండిపోయింది. కళ్ళు మసకలు కమ్మటం మొదలయింది.

అతి ప్రయత్నం మీద రివాల్వర్ ఎత్తి ట్రిగ్గర్ నొక్కాడు.

'మైగాడ్!' అన్న అరుపు.... బరువైన శరీరం ఒకటి గచ్చు మీద పడిన శబ్దం వినవచ్చాయి. మళ్ళీ రివాల్వరుని పేల్చాడు షాడో. మరో ఆర్తనాదం.... ఆ తరువాత చూపుడు వేలిని కంట్రోలు చేయటం షాడోకు చేతకాలేదు.

'ధన్....ధనాధన్...ధన్! నాలుగు బుల్లెట్లు బయటకు దూసుకు పోయాయి. రివాల్వర్ ఖాళీ అయిపోయింది.

పాంటు జేబులో ఫ్రష్ బుల్లెట్లున్న అట్ట పెట్టె వుంది. దాన్ని తీసి రివాల్వర్‌లో బుల్లెట్లు ఎక్కిద్దామనుకున్నాడు. కాని రివాల్వర్ చేతిలో నుంచి జారిపోయింది.

మోకాళ్ళు మడతబడటం ప్రారంభించాయి. పళ్ళ బిగువున జారిపోతున్న శక్తిని కూడగట్టుకున్నాడు. బూటులో వున్న జాగర్ ని తీసి గట్టిగా బిగించి పట్టుకున్నాడు.

నిముషం గడిచింది....ఎవరూ రాలేదు.

తల మాత్రం కొద్దిగా బయటకు నెట్టి తొంగి చూశాడు. ద్వారం ముందు మూడు శరీరాలు పడివున్నాయి....

దూరంలో కాకీరంగు యూనిఫాం ధరించిన సెక్యూరిటీ గార్డులు కొంత మందిని పట్టుకొని.... అటే వస్తున్నారు.

తను వారికి కనిపిస్తే..

గుడ్డిగా పక్కకు అడుగులు వేశాడు షాడో.... కిల్లర్స్ గాంగ్ మనుష్యులు అంత తేలికగా వదలరు. బయట కాపు వేసి వుంటారు..... తను బిల్డింగ్ బయటికిపోతే..... పిచ్చి కుక్కను చంపినట్లు చంపుతారు.

లేకపోతే..... సెక్యూరిటి గార్డుల చేతికి చిక్కి జైలుకు పోవాలి. జైల్లో అడుగు పెట్టకముందే హతం చేయగల శక్తి కిల్లర్స్ గాంగ్‌కి వుంది.

షాడో కళ్ళ ముందు ఒక కిటికీ ప్రత్యక్షమయింది. తల వంచి వేగంగా అడుగులు వేశాడు. ఆఖరి క్షణంలో ఎగిరి దాన్ని కుడిభుజంతో గుద్దాడు.

గాజు తలుపులు...... ముక్కలు ముక్కలై పోయాయి. తల్లక్రిందులుగా బయటపడ్డాడు షాడో.

తల దిమ్మెక్కిపోయింది ఆ అదురుకు ముంచుకు వస్తున్న మైకం కొద్దిగా వదిలింది.

ఫాంటు జేబులో హేండ్ కర్చీఫ్‌ని తీసి ఎడమచేతికి కట్టాడు. చొక్కా వూడతీసి చేతిచుట్టూ చుట్టాడు. తొడమీది గాయం అలాగేవుంది. దానికి బనియన్ తీసి చుట్టి..... అర్ధనగ్నంగా ముందుకు పరుగు తీశాడు.

విమానాశ్రయం పక్కనే కాంటాక్ సిటీకి పోయే మెయిన్ రోడ్డు వుంది. ఆ రోడ్డుకు ఆవలివైపున సిక్కిం ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధతో పెంచుతున్న పూలతోట ఒకటి వుంది.

రోడ్డు దాటుతుండగా..... ఎయిర్ పోర్టు ముఖద్వారం దగ్గిర నిలబడివున్న కిల్లర్స్ గాంగ్ మనుష్యుల కంటపడ్డాడు షాడో.

"రేయ్...అడుగో.... అటు పోతున్నాడు.... కమాన్," అని అరుస్తూ వచ్చిపడ్డారు వారందరూ.

పిచ్చిగా పరుగుతీశాడు షాడో. పూలతోటకు ముళ్ళతీగల ఫెన్సింగ్ అడ్డుంది. ఆ ముళ్ళు గుచ్చుకుంటాయని కూడా చూసుకోకుండా జంప్ చేసి అవతలకు పోయాడు.

వంద గజాల దూరం పోయేసరికి షాడో పని అయిపోయింది. కళ్ళు బైర్లు కమ్మి ఒకచోట బోర్లాపడిపోయాడు.

"మైగాడ్! ఎవరు? ఏమిటీ ఆకారం??" అన్న మాటలు వినిపించాయి..... ఏవో చేతులు ... . మృదువుగా షాడో శరీరాన్ని తడిమాయి.

మత్తెక్కించే సెంటు వాసన షాడో నాశికారంధ్రాలకు సోకింది..... బైర్లు కమ్మిన కళ్ళముందు ఒక యువతి రూపం అస్పష్టంగా ప్రత్యక్షమయింది.

జారిపోతున్న డాగర్‌ను మరింత గట్టిగా పట్టుకున్నాడు షాడో.... "మేడమ్.....నాతో వుంటే మీకు ప్రమాదం తప్పదు. ప్లీజ్ పారిపొండి... నన్ను వదిలి దూరంగా వెళ్ళిపొండి...."

ఆ తర్వాత ఏమయిందో షాడోకు తెలియదు. ఏదో తెలియని చీకటి లోకాలకు వెళ్ళిపోయాడు.

* * * *

కళ్ళు తెరిచాడు షాడో. మెత్తటి ఫోమ్ బెడ్ మీద పడుకుని వున్నట్లు గ్రహించాడు. భుజాల వరకూ మృదువైన వున్ని దుప్పటి కప్పి వుంది.

లేవడానికి ప్రయత్నించాడు..... ఎడమ చేయి ఎవరో నరికేసినట్లు బాధ పెట్టింది. ముఖమంతా చెమటతో నిండి పోయింది. పళ్ళు బిగించి..... పైకి అరవకుండా బాధను దిగమ్రింగుకున్నాడు.

పదినిముషాలకు గాని ఆ బాధ వుపశమించలేదు. బాధ తగ్గగానే - - మెదడు క్లియర్ అయింది. జరిగినవన్నీ ఒకటొకటిగా గుర్తుకు రాసాగాయి.

అవునూ..... తను ఎక్కడ వున్నట్లు?

ఈసారి ఎడమచేయి కదలకుండా జాగ్రత్త తీసుకుంటూ తలతిప్పి చుట్టూ చూశాడు.

ఒక మూలకు చూడగానే కళ్ళు చెదిరిపోయాయి.... నరాలన్నీ జివ్వుమన్నాయి.

కొంపతీసి.....మరణించి స్వర్గంలోకి చేరుకోలేదు కదా అన్న అనుమానం కలిగింది. కాని కట్లు వున్న ఎడమచేయి ఆ అనుమానాన్ని ఆదిలోనే అంతం చేసింది.

ఆ గదిలో - - - షాడో చూసిన దిక్కుగా.... ఒక టేబిల్ వుంది. దానిమీద పద్మాసనం వేసుకొని కూర్చున్న పాల రాతి బొమ్మ ఒకటి వుంది.

చిన్న కట్ డ్రాయర్, మరింత చిన్న బ్రాసరీ మాత్రమే ధరించి వుంది ఆ బొమ్మ. వచ్చిన బాధ అంతా.....ఆ బ్రాసరీలో నుంచి బయటకి వుబికి..... పైకి కిందికి వూగుతున్న స్తనద్వయాన్ని చూస్తుంటేనే..... వస్తున్నది.

ఆ బొమ్మకు ప్రాణం వుంది.... అది గాలికి ఎగిరి ముఖం మీద పడుతున్న పట్టుకుచ్చుల లాంటి బాబ్డ్ హెయిర్ ని చూస్తుంటే తెలుస్తున్నది.

ఉన్నట్లుండి కళ్ళు తెరిచిందా బొమ్మ. షాడో తననే చూస్తూ వుండటం గమనించి..... "మైగాడ్ ! మెలుకువ వచ్చిందా?" అని ఆనందంగా అరుస్తూ ఎగిరి టేబిల్ మీద నుంచి కిందికి దూకింది.

ఆమె మంచాన్ని సమీపించగానే.....గుప్పుమని వచ్చింది ఒక విధమైన సెంటు వాసన.... షాడో మెదడు వెనక్కి పరుగెత్తింది. పార్కులో పడిపోయే ముందు కూడా అదే వాసన వచ్చింది.

"యస్. మిస్టర్! స్పృహ లేకుండా పడిపోయావు. నిన్ను తరుముకుంటూ వచ్చిన హంతకులకు టోకరా యిచ్చి నిన్ను మా కారు డిక్కీలో దాచిపెట్టాం..... మూడు రోజుల నుంచీ నీకు వైద్యం చేయలేక నానా బాధలు పడుతున్నాం....."

షాడో ప్రక్కన కూర్చుంటూ అన్నదామె.

"మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావటం లేదు...." కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ అన్నాడు షాడో.

అదే సమయంలో గది తలుపులు తెరుచుకున్నాయి. మరో ఇద్దరు దేవకన్యలు గదిలోకి వచ్చి తలుపు గడియ పెట్టారు.

"ఇదిగో ఇది 'మాలిని' - కాంటాక్ మెడికల్ కాలేజిలో మెడిసిన్ థర్డు ఇయర్ చదువుతున్నది. దీని పేరు సోనీ - మెడిసిన్ ఫోర్త్ - నా పేరు రాకీ - నేను కూడా నాలుగవ సంవత్సరమే - ఇది మా ప్రయివేట్ ఎపార్టుమెంటు..... మేము ముగ్గురమూ రూమ్మేట్స్.... మరి నీ పేరు ఏమిటి?" రికార్డు ప్లేయర్‌లా ఏక బిగిన చెప్పి..... ఆఖరికి ప్రశ్నించింది రాకీ.

తను ప్రాణాలతో వుండటం ఎందువల్ల సాధ్యపడిందో అర్థం చేసుకున్నాడు షాడో. వారికున్న నాలెడ్జిని ఉపయోగించి తనకు వైద్యం చేశారు..... వారు ముగ్గురూ.

"నా పేరు రాజు...." అన్నాడు లేచి కూర్చోవటానికి ప్రయత్నిస్తూ.

వెంటనే అడ్డుపడింది మాలిని.

"నోనో రాజు ! నువ్వు యింకో వారం దాకా కదలకూడదు. కంప్లీట్ బెడ్ రెస్టు అవసరం...." అన్నది సీరియస్‌గా.

ఈ లోపల సోనీ ఏవేవో ఇంజక్షన్స్ తయారు చేసి ఒకదాని తరువాత ఒకటిగా షాడో కుడి భుజంలోకి ఎక్కించింది.

షాడో తల తిరిగిపోయింది. దెబ్బతిన్నది ఎడమ భుజమో కుడి భుజమో అర్థం కాకుండా పోయింది. రెండూ ఒకే మాదిరి సలుపు పెట్టడం ప్రారంభించాయి.

"రాజు! నువ్వు ఎవరివో మాకు తెలియదు. ఫ్లవర్ గార్డెన్‌కి పిక్నిక్‌కి వచ్చాం మేము. నిన్ను చూడగానే హెల్ప్ చేయాలని అనిపించింది. కారులో దాచిన తరువాత అన్నీ అనుమానాలే..... గార్డెన్ అంతా పోలీసులతో నిండిపోయింది. ఎయిర్‌పోర్టులో ఏదో గొడవ జరిగిందట..... చాలా మంది మరణించారని అంటున్నారు. ఎందుకైనా మంచిదని నిన్ను అతి రహస్యంగా యిక్కడికి తీసుకు వచ్చాము. అందువల్ల నీకు పూర్తి శక్తి వచ్చేదాకా బయటికి రావడం మంచిది కాదు." స్పూన్‌తో వేడి వేడి పాలు షాడో నోటికి అందిస్తూ వివరించింది సోనీ.

ఆమె యిచ్చిన యింజక్షన్స్ షాడోని నిద్రలో ముంచి వేసాయి.... ఒక రాత్రివేళ మెలుకువ వచ్చింది..... విపరీతమయిన చలి వేస్తున్నది.... లేచి దుప్పటి వంటినిండా కప్పుకోవడానికి ప్రయత్నిస్తూ ప్రక్కకు చూశాడు. మంచం ప్రక్కనే కంబళ్ళు పరుచుకొని పడుకొని వున్నారు వారు ముగ్గురూ..... నిద్రలో అమాయకంగా.... పసిపిల్లల మాదిరి నవ్వుకుంటున్నారు.

* * * *

షాడో పూర్తిగా కోలుకోవటానికి మూడు రోజులు పట్టింది. ఇరవై నాలుగు గంటలు ప్రక్కనే వుండి సేవలు చేశారు రాకీ, సోనీ, మాలినిలు. షాడో కళ్ళు తెరిచినప్పుడల్లా ఏదో ఒక ఇంజక్షన్ యిచ్చి..... పాలు.... పళ్ళు మొదలయిన ఆహారం యిచ్చి నానా గొడవ చేసేవాళ్ళు.

మూడవ రోజున తనంతట తానుగా మంచం మీద నుంచి లేచి.... తప్పటడుగులు వేస్తూ గదంతా తిరిగాడు షాడో.

ఆ రోజు కాలేజికి వెళ్ళారు అతని గార్డియన్‌లు ముగ్గురూ.

ఎడమ భుజాన్ని కదిలించి చూసుకున్నాడు షాడో. నాట్ బాడ్..... కొద్దిగా పెయిన్ వుంది. అయినా పర్వాలేదు.

సాయంత్రం మూడు గంటలకు ముందుగా వచ్చింది రాకీ. ఆమెను. ఎయిర్ పోర్టుకి పంపించి...... తన బ్యాగ్ ఏమయిందో తెలుసుకోవాలని రిక్వెస్ట్ చేశాడు.

ఆయుధాలు లేవు. రివాల్వర్, డాగర్ రెండూ ఎక్కడో జారిపోయాయి. ఎయిర్‌బాగ్‌లో మరో జత వున్నాయి. వాటికోసం కాకపోయినా.... బట్టల కోసమయినా బాగ్ చాలా అవసరం.

ఆరు గంటలకు తిరిగి వచ్చింది రాకీ. ఎయిర్ బాగ్ తీసుకు వచ్చింది. ఎనిమిది గంటలకు మిగిలిన యిద్దరూ వచ్చారు. కబుర్లతో కాలక్షేపం

అయ్యింది. మరునాడు ఉదయం వారు కాలేజికి వెళ్ళిన తరువాత మెల్లిగా బయలుదేరాడు షాడో.

ఎయిర్ బాగ్ అడుగున ఒక సీక్రెట్ అర వున్న ది. అందులో ఆయుధాలు వున్నా యి. నల్లని ఫాంటు, తెల్లని షర్టు వేసుకొని రివాల్వర్‌ని ఎడమచేతి క్రింది గుండెల మీద బిగించాడు. డాగర్‌ని బూటు లోపలికి పంపించి.... నెమ్మదిగా ఎపార్టుమెంటు ముఖ ద్వారాన్ని తెరిచాడు.

షాడో వూహ సెంట్‌పర్సంట్ కరెక్టు అయ్యింది. ఎయిర్ పోర్టు మీద నిఘా వేసింది కిల్లర్స్ గాంగ్. రాకీ ఎయిర్ బాగ్ తీసుకు రావటానికి వెళ్ళగానే వెన్నంటి వచ్చింది.

ఇంటికి ఎదురుగా ఒక యువకుడు నిలబడి దిక్కులు చూస్తున్నా డు . తలుపులు మూసి రెండు క్షణాలు ఆలోచించాడు షాడో.

మాలినీ, రాకీ, సోనీలు కాలేజికి వెళ్ళిపోవటం గమనించి ఉంటాడతను. కొద్దిసేపు వెయిట్ చేసి ఎపార్టుమెంట్‌ని వెతకటానికి రావచ్చు.

అరగంట తరువాత ముఖద్వారం ముందు అలికిడి అయ్యింది. వెంటనే బెడ్ రూమ్ లోకి పోయి తలుపు చాటున నిలబడ్డాడు షాడో.

పిల్లిలా అడుగులు వేస్తూ వచ్చాడా యువకుడు. గదిలోకి రాగానే కాలుకి కాలు అడ్డం పెట్టాడు షాడో. ముందుకు తూలిపడిపోయాడతను.

అతన్ని ప్రాణాలతో పట్టుకొని తీరికగా అన్ని విషయాలు తెలుసుకుందామని షాడో ఉద్దేశ్యం. కాని క్రింద పడిన మరుక్షణం ఫాంటు జేబులోనుంచి రివాల్వర్ ని తీశాడా యువకుడు.

మెరుపులా ప్రక్కకు దూకాడు షాడో. సైలన్సర్ అమర్చబడి వున్న దా రివాల్వర్ కు. టప్ మని ప్రేలింది. బుల్లెట్ షాడో చెవి ప్రక్కనుంచి దూసుకు పోయింది.

కిందికి వంగి రివాల్వర్ని లాక్కునే వ్యవధి లేదు. బూటు కాలితో అతని చేతిని తన్న టానికి ప్రయత్ని ంచాడు షాడో.

మరోసారి ప్రేలింది రివాల్వరు. ఈ సారి బుల్లెట్ షాడో చెవికి రాసుకుంటూ పోయింది. క్రిందినుంచి పేల్చడం వల్ల ఆ యువకుడికి గురి సరిగ్గా అందటం లేదు.

ఆలస్యం చేసినా, ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేసినా ప్రాణాలు పోగొట్టుకోవటం తథ్యం అని గ్రహించాడు షాడో.

ఎడమ మోకాలు కొద్దిగా వంచి కుడికాలుతో యువకుడి తలని బలంగా తన్నా డు ఫుట్ బాల్ లాగా. ఫట్ మని పగిలింది..... క్షణాలమీద అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

అతన్ని అక్కడే వదిలి బయటకు వచ్చాడు షాడో. వీధి చివర ఒక నీలం రంగు అంబాసిడర్ కారు నిలబడి వుంది. దానిలోని డ్రయివర్ ఎపార్టుమెంటు వైపే చూస్తున్నాడు.

ముఖ ద్వారం మూసి ఎపార్టుమెంట్ వెనుక తలుపులు తెరిచాడు షాడో. చుట్టూ తిరిగిపోయి అంబాసిడర్ ను వెనుక నుంచి సమీపించాడు.

నిశ్శబ్దంగా పక్కకుపోయి ముందు తలుపు తెరిచి సీటులో కూర్చున్నాడు. వులిక్కిపడి ప్రక్కకి చూశాడు డ్రయివర్.

"హల్లో !" అన్నాడు షాడో.

డ్రయివర్ ముఖం పాలిపోయింది. గుడ్లు వెళ్ళబెట్టి నోరు తెరిచాడు.

"నీ స్నేహితుడు ఎపార్టుమెంటులో నీ కోసం వెతుకుతున్నాడు..... మిమ్మల్ని పంపించిన వాళ్ళ పేర్లు తెలుసుకోమని నాతో చెప్పాడు" కామ్ గా అన్నాడు షాడో.

గుటకలు మింగాడు డ్రయివరు..... రెండు క్షణాలు ఆలోచించి డాష్‌బోర్డులో వున్న ఒక విజిటింగ్ కార్డు తీసి యిచ్చాడు.

డ్రయివరు మీదినుంచి దృష్టి మరల్చకుండా కార్డును కనుచివరలనుంచి చూశాడు షాడో. 'ఎక్స్ పోర్టు అండ్ ఇంపోర్ట్ ఏజన్సీ - - - ప్రొప్రయిటర్ దలైలా ' బంగారు అక్షరాలతో మిలమిలా మెరుస్తున్నదది.

షాడో మనస్సులో కిల్లర్సుగాంగ్ లోని ప్రముఖుల పేర్లు కంప్యూటర్ బెల్టులా గిర్రున తిరిగాయి . దలైలా..... కిల్లర్స్ గ్యాంగ్ హత్యలు చేయాలనుకుంటే దలైలాను నియమిస్తుంది. అటువంటి విషయాల్లో ఎక్స్‌పర్టు అతను.

చిన్న చిరునవ్వు షాడో పెదవుల మీద మెరిసి మాయమై పోయింది. హత్యలు చేయించగల దలైలాకు....షాడో తరపున చిన్న బహుమతి అందించాలి.

షాడో ఆలోచనలలో వుండటం గమనించాడు. డ్రయివర్, తలుపు తెరిచి బయటకు దూకాడు అతి వేగంగా.

అంతకంటే వేగంగా కదిలాడు షాడో. రివాల్వరు మడమతో అతని మెడ మీద బలంగా కొట్టాడు. కెవ్వున అరచి పడిపోయాడు డ్రయివరు.

డిక్కీ తెరిచి అతన్ని అందులో పడవేశాడు షాడో. కారును కదిలించి ఎపార్టుమెంటు ముందుకు పోనిచ్చాడు. లోపల వున్న బాడీని కూడా ఒక దుప్పటిలో చుట్టి డిక్కీలో చేర్చాడు.

బెడ్‌రూమ్ లోని రక్తపు మరకలను శుభ్రంగా తుడిచి ఎపార్ట్‌మెంట్‌ని లాక్ చేసి బయలుదేరాడు.

మటాకా ఏరియాలో వుంటాడు దలైలా.... మటాకా ఏరియా రాకీ ఎపార్టుమెంట్‌కి పదిమైళ్ళ దూరంలో వుంది.

* * * *

ఇండియా - పాకిస్థాన్ యుద్ధంలో కిల్లర్స్ గాంగ్ తరపున పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాడు దలైలా. అతని సర్వీసుకు మెచ్చి కాంటాక్ నగరంలో గాంగ్ నాయకుడు దర్బార్‌కి అసిస్టెంట్‌గా నియమించింది గాంగ్.

అంతవరకూ అతడు మొదలు పెట్టిన పని పూర్తి కాకపోవటం అంటూ లేదు. మొదటిసారిగా దెబ్బ తిన్నాడు షాడో విషయంలో.

"దలైలా ! నీ పేరు పోవటమే కాదు.... గాంగ్‌కి కూడా అప్రతిష్ట వస్తోంది.... చేతికి చిక్కిన షాడోని ఏమీ చేయలేక పోగా ఎనిమిది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు ఎయిర్‌పోర్టులో. ఆ గొడవను సరిచేసుకోలేక నానా బాధలు పడుతున్నాం. షాడో మాయం అయ్యాడు. మరొక్కసారి బయటికి వచ్చాడంటే మన అంతు చూసి గాని వెనుతిరగడు. ఆ పని జరిగేముందుగానే మనం షాడోని ఖతం చేసెయ్యాలి. సీ ఎబౌట్ యిట్..... షాడో ఎక్కడ దాక్కున్నాడో తెలుసుకో" ఫోన్ చేసి హెచ్చరించాడు దర్బార్..... సిక్కిం గాంగ్ నాయకుడు.

దలైలా సమాధానం కోసం ఎదురుచూడకుండా ఫోన్ పెట్టేశాడు.

సిగరెట్ వెలిగించాడు దలైలా... వెలిగించిన వెంటనే ఆరిపోయింది. మరోసారి.... మరోసారి.... మొత్తం పది అగ్గిపుల్లలు గీసినా సిగరెట్ వెలగలేదు. చేతులు అతి దారుణంగా కంపిస్తున్నాయి.

అసహనంగా సిగిరెట్‌ని విసిరికొట్టి తల రెండు చేతులతోను పట్టుకున్నాడు. దర్బార్ మాటల్లో మరో అర్థం ప్రతిధ్వనిస్తోంది. షాడోని పట్టుకోవటం కుదరకపోతే..... దలైలాని పట్టుకుంటుంది గాంగ్....

అలోచనలతో వేడెక్కిపోయింది దలైలా మెదడు. తన అనుచరులు ఇద్దరూ ఎయిరుపోర్టులో వున్న ఒక ఎయిర్‌బాగ్‌ను క్లయిమ్ చేసిన యువతిని అనుసరించిపోయారు.

వారి వద్దనుంచి ఏ విధమైన సమాచారము రాలేదు..... గాడ్, షాడో అక్కడ కనిపిస్తే బాగుండు!!

తలుపు తట్టిన శబ్దం వినరావటంతో వులిక్కిపడి తల ఎత్తాడు దలైలా.

"బాస్ ! మన వీధిలో ఒక కారు ఆగి వుంది.... మన కారే అది....." అని రిపోర్టు చేశాడు అతని బాడీగార్డు - - తలుపు దగ్గర నిలబడి.

దలైలాకి ఆ మాటలు అర్థం కాలేదు. తమ కారు వీధిలో ఆగివుండటం ఏమిటి!

గదిలో నుంచి బంగ్లా ముందుకు వచ్చాడు. అక్కడినుంచి క్లియర్‌గా కనిపిస్తోంది ఆ కారు. ఎవరూ లేరందులో.

బాడీగార్డును పోయి ఏమిటో చూడమని సైగ చేశాడు.

* * * *

కారుకు పదిగజాల దూరంలో రోడ్డు పక్కగా వున్న చెట్టు మీద వున్నాడు షాడో. దట్టమైన ఆకుల వెనుక దాగుకొని అంతా గమనిస్తూనే వున్నాడు.

దలైలా బాడీగార్డును పంపటం గమనించి, రివాల్వర్‌ని రెడీగా పట్టుకొన్నాడు. మెల్లిగా కారును సమీపించాడు ఆ వ్యక్తి.

లోపలికి తొంగి చూశాడు. వెనుక సీటును జాగ్రత్తగా పరిశీలించాడు. తల బరుక్కుంటూ డిక్కీ దగ్గిరికి వచ్చాడు.

డిక్కీ తెరిచిన మరుక్షణం.... అతని ముఖం తెల్లగా పాలిపోయింది. “బాస్ !” అని పెద్దగా అరిచాడు.

వేగంగా కారు దగ్గిరికి వచ్చాడు దలైలా. డిక్కీలో వున్న కారు డ్రయివర్‌కు స్పృహ వచ్చినట్లుంది....మెల్లిగా బయటకు వస్తున్నాడు.

రెండు క్షణాలు ఆగి ఫైరింగ్ ఓపెన్ చేశాడు షాడో.

కిందికి దిగుతున్న డ్రయివర్ మళ్ళీ డిక్కీలోకి దూకాడు. దలైలా వెనుతిరిగి అతివేగంగా భవనం వైపు పరుగులు తీశాడు. అతని బాడీగార్డు కిందపడి దొర్లుకుంటూ కారు కిందికి పోయాడు.

అతన్ని వదిలి పెట్టి రివాల్వర్‌ని దలైలా భవనం మీదికి తిప్పాడు షాడో. ముందున్న గాజు కిటికీలకు పెద్ద పెద్ద రంధ్రాలు చేశాడు.

రివాల్వర్ మోతలు చుట్టుపట్ల వున్న వారిని ఆకర్షించడం గమనించి, చల్లగా చెట్టుదిగి ఆ ప్రదేశాన్నించి జారుకున్నాడు.

జరిగిన గొడవ దలైలాను కొంచెం భయపెడుతుంది. ఈ సారి దలైలాను పూర్తిగా అణగదొక్కే ఏర్పాటుతో రావాలి! సిటిబస్ నొకదాన్ని ఎక్కి సిటీ మధ్యకు వెళుతూ అనుకున్నాడు షాడో.

* * * *

"పొప్పట్ లాల్, పాన్ బ్రోకర్." మెయిన్ రోడ్డుకు దూరంగా ఒక చిన్న సందులో వున్నది ఆ రోడ్డు. లావు పాటి పొప్పట్ ఒక వడ్డీ వ్యాపారి. తాకట్టు పెడితే డబ్బు యిస్తాడు.

సరాసరి పొప్పట్ లాల్ దగ్గిరికి పోయాడు షాడో.

"ఎవరూ! ఏం కావాలి!" లోపలినుంచి అరిచాడతను. భోజనం చేస్తున్నట్లున్నాడు - - దుకాణం మూసి వుంది.

"ఒక పరిచయస్తుడు వచ్చాడని చెప్పండి." బయటకు వచ్చిన పొప్పట్ లాల్ భార్యతో చెప్పాడు షాడో.

లోపలికి వెళ్ళిందామె. మెల్లిగా పొప్పట్ లాల్ బయటికి వచ్చాడు. షాడోని చూడగానే అతని వదనంలో అనేక రకాల భావాలు చోటు చేసుకున్నాయి. "అరె....రాజూ సాబ్ !! రండి....రండి...." అంటూ హడావుడిగా ఆహ్వానించాడు.

లోపలికి పోయాడు షాడో. కుర్చీ వేసి, కూర్చోబెట్టి..... భార్యను కాఫీ తీసుకురమ్మని పురమాయించాడు పొప్పట్ లాల్.

"పొప్పట్ లాల్! నాకు కొంచెం ఇన్ఫర్మేషన్ కావాలి...." సూటిగా అడిగాడు షాడో.

"రాజు సాబ్.... మీరలా అడగకూడదు. ఏం కావాలో చెప్పి..... సమాధానం కోసం ఎదురు చూడాలి." నవ్వుతూ అన్నాడు పొప్పట్ లాల్.

"ఇక్కడ కిల్లర్స్ గాంగ్‌కి నాయకుడు దర్బారే కదూ!" ప్రశ్నించాడు షాడో.

అవునన్నాడు పొప్పట్ లాల్.

"అతనెక్కడ వుంటాడు! "

"రాజు సాబ్.... దర్బార్ అడ్రసుగాని, కిల్లర్స్ గాంగ్ స్థావరాలు గాని ఎక్కడ వుంటాయో నాకు తెలియదు. చాలా రహస్యంగా వుంచుతారా విషయాలు. కాకపోతే ఒక్కటి మాత్రం తెలుసు. ట్వీడిల్ ఏజన్సీస్ అనే సంస్థ ఒకటి వుంది యిక్కడ. భారత దేశంలో జరిగే గుర్రపు పందేలు, బ్రాకెట్లు.... యింకా మొదలైన పందేలన్నింటికీ బ్రాంచి ఆఫీసు అది. ప్రజలను మోసం చేసి లక్షలు కూడబెడుతున్నారు. కాంటాక్‌లో వున్న క్లబులన్నిటినీ ఆ సంస్థ మేనేజి చేస్తోంది. అది కిల్లర్ గాంగ్ ప్రతిరూపం."

పొప్పట్ లాల్ మాటలకు సాలోచనగా తల వూపాడు షాడో.

"ఏం సాబ్ ! ఏమైనా మషాలా కావాలా?" షాడో ఆలోచనలో పడటం గమనించి అడిగాడు పొప్పట్ లాల్.

అవునన్నాడు షాడో. తనకు కావలసిన మషాలా లిస్టు వ్రాసి అతనికి అందించాడు. దాన్ని చూసి..... ఎవరికో ఫోన్ చేసి వచ్చాడు పొప్పట్ లాల్. తరువాత షాడోని ఒక గదిలోకి తీసుకుపోయాడు. నేలమీద పరిచివున్న తివాసీని తొలగించి.... అండర్ గ్రౌండ్‌లోని మూసివున్న తలుపు తెరిచాడు.

పాతిక అడుగుల లోతున చిన్న గది వున్నది. దాని గోడలన్నీ పొప్పట్ లాల్ తాకట్టు వ్యాపారంలో సంపాదించి వున్న వస్తువులతో నిండి వున్నాయి. మామూలు నగలు.... వంటపాత్రలే కాదు.. మిషన్ గన్స్.... చేతి బాంబులు మొదలైన ఆయుధాలు కూడా అతని దగ్గరకే వస్తాయి. వాటిని దాచి వుంచి.... అవసరమై వచ్చిన వారికి అమ్ముతాడు పొప్పట్ లాల్.

షాడో సూచించిన ఆయుధాలను ఒక గుడ్డలో మూటకట్టి యిచ్చాడు. ఇద్దరూ బయటికి వచ్చేసరికి ఒక సెకండ్ హేండ్ ఫియట్ కారు దుకాణం ముందు ఆగి వుంది. షాడో కోసం ఫోన్ చేసి తెప్పించినదది.... మొత్తానికి వెల కట్టి డబ్బు తీశాడు షాడో.

"వద్దు. రాజు సాబ్.... మీ దగ్గిర డబ్బు తీసుకుంటే.... నాకు పుట్టగతులుండవు...." నిరాకరించాడు పొప్పట్ లాల్.

బలవంతంగా అతని జేబులో డబ్బు పెట్టి, తను ఖరీదు చేసిన సామాను ఫియట్ డిక్కీలోకి చేర్చాడు షాడో. మెల్లిగా డ్రయివ్ చేసుకుంటూ పోయి మెయిన్ వీధిలో వున్న ఒక పెద్ద హోటల్ ఆవరణలో ఆపాడు.

కారు ఆగగానే పరిగెత్తుకుంటూ వచ్చాడు వాచ్ మన్.

"కారును యిక్కడే వదిలిపోతాను. రేపు వుదయం వచ్చి తీసుకుంటాను." రెండు చిల్లర కాగితాలు అతని చేతిలో పెడుతూ అన్నాడు షాడో.

"మీ యిష్టం వచ్చినప్పుడు రండి సార్.... మీ కారు సురక్షితంగా వుంటుంది." ఆనందంగా శాల్యూట్ చేస్తూ అన్నాడు వాచ్‌మన్.

అక్కడినుంచి కాలినడకన బస్ స్టాప్ దగ్గరికి వెళ్ళాడు షాడో. అరగంట వెయిట్ చేసిన తరువాత కావలసిన బస్ వచ్చింది.

"ట్వీడిల్ సెంటర్" అని చెప్పి టిక్కట్ తీసుకున్నాడు. పావుగంట తరువాత ట్వీడిల్ ఏజన్సీ వున్న నాలుగు అంతస్థుల కాంక్రీట్ భవంతి ముందు బస్ దిగాడు.

* * * *

ట్వీడిల్ ఏజన్సీస్ క్రింది అంతస్థు అంతా కాష్ కౌంటర్లతో నిండి వుంది. ఎక్కడో బెంగుళూరులో జరిగే గుర్రపు పందేలకు.... పందెం కట్టే సౌకర్యం

సిక్కింలోనే ఏర్పాటు చేస్తోంది ఆ ఏజెన్సీ. బొంబాయిలో జరిగే టంకా, బ్రాకెట్ వ్యాపారాలు.... సిక్కింలో కూడా నిర్వహిస్తోంది.

రెండవ అంతస్థులో పెద్ద క్లబ్ వుంది. మూడవ అంతస్తు మరో పెద్ద జూదశాల. నాలుగవ అంతస్థు ఒక వ్యభిచార గృహం.

కాష్ కౌంటర్ల ముందు నిలబడి ఆ వ్యవహారాలన్నిటినీ జాగ్రత్తగా గమనించాడు షాడో. అక్కడ దాదాపు పాతిక మంది గాంగ్ అనుచరులు కాపలా వున్నా రు. వాచ్‌మన్ల రూపంలో రైఫిల్స్ పట్టుకొని నిలబడి వున్నా రు. వాచ్‌మన్ల రూపంలో రైఫిల్స్ పట్టుకొని నిలబడి వున్న వారు కాక కస్టమర్స్‌లా యథాలాపంగా తిరుగుతూ భవనాన్ని జాగ్రత్తగా కాపలాకాస్తున్నా రు.

షాడో దృష్టి.... కాష్ కౌంటర్స్ పక్కన.... భవనం వెనక్కుపోయే ద్వారం మీద పడింది. దాని ముందు యిద్దరు రైఫిల్స్ తో నిలబడి వున్నా రు.

వారిని, ఆ తలుపును చూడగానే షాడో మనస్సులో చిన్న చిలిపి ఆలోచన రేకెత్తింది. లోపల ఏమున్న దో చూడాలన్న కోరిక అతని మనస్సులో బలపడింది.

పక్కలకు కూడా చూడకుండా, ఠీవిగా అడుగులు వేస్తూ ద్వారాన్ని సమీపించాడు.

అతని వ్యవహారం కాపలా వారిద్దరినీ సందేహంలో ముంచివేసింది. షాడో వారి ముందు ఆగి పర్మిషన్ తీసుకునే వూపులో లేడు. సీరియస్ గా ముఖం పెట్టి మీది మీదికి పోయాడు.

తడబడుతూ కొంచెం....ఒక్క అంగుళం పక్కకు జరిగాడు ఒక గార్డు. "కమాన్ బ్లడీ.... ఓపెన్ ది డోర్ యూ డర్టీ...." కిల్లర్స్ గాంగ్ బాస్‌లు అనుచరులను పలకరించే మాటలను వుపయోగిస్తూ విసుగ్గా అన్నాడు షాడో.

ఖంగారు పడిపోయారు వారిద్దరూ.

"ఎవరు...లోపలకు పోవటానికి .... ఐడెంటిఫికేషన్.... అదీ.... వుండాలి...." నత్తి నత్తిగా, ఆగి ఆగి గుటకలు మింగుతూ అన్నాడొక గార్డు.

"షటప్ యూ డర్టీ బాస్టర్డ్....ముందు తలుపు తెరుస్తావా లేదా ! అతిగా వాగితే దర్బార్ ఐడెంటిఫికేషన్ స్టాంపుల్ని నీ ముఖం నిండా కొట్టేస్తాను." కళ్ళు ఎర్రచేసి గుర్రుగా అన్నాడు షాడో.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని గోడ మీద బటన్ నొకదాన్ని నొక్కారు వారు. తలుపు తెరుచుకున్నది. తాపీగా లోనికి అడుగుపెట్టాడు షాడో. అతని వెనుకే మూసుకుంది తలుపు.

లోపల ఒక పెద్ద బాంక్ మాదిరిగా కనిపిస్తోంది. డబ్బును లెక్కకట్టి కట్టలు కట్టలుగా సంచుల్లో నింపుతున్నారు నలుగురు యువతులు.

మరికొందరు వ్యక్తులు బంగారు బిస్కట్లను త్రాసుల్లో వేసి తూచి తోలు సంచుల్లో భద్రపరుస్తున్నారు. మరొక మూల అతి ఖరీదయిన వజ్రాలు.... బంగారు నగలు పాక్ చేయబడుతున్నాయి.

కాంటాక్ కిల్లర్స్ గాంగ్ మనీ అంతా అక్కడే వుంది. ఆ గదికి అవతలి వైపున మరో ద్వారం వుంది. అది భవనం వెనుక వున్న సందులోకి దారి తీస్తుంది. దాని ముందు కూడా యిద్దరు గార్డులు కాపలా నిలబడి వున్నారు.

రిమ్‌లెస్ కళ్ళజోడు ధరించిన మధ్య వయస్సుడొకడు అక్కడి వారినందర్నీ అదిలించి సూపర్‌వైజ్ చేస్తున్నాడు వారి పనులను.

షాడో మనస్సులో మరో పథకం రూపు దిద్దుకుంది. అతి సీరియస్‌గా ఆ మధ్య వయస్కుణ్ణి సమీపించి..... పక్కకు తీసుకు పోయాడు.

"ఖంగారుపడవలసిన పనిలేదు.... మనకు యింకో గంట మాత్రమే వ్యవధి వుంది. క్యాష్‌నంతా కట్ట కట్టండి.... వెంటనే ఈ భవనాన్ని వెకేట్ చేయాలి." అని చెప్పాడు అతి రహస్యంగా.

అతనికి ఆ మాటలు అర్థం కాలేదు.

"దర్బార్ యీ పాటికి బయలుదేరి వుంటాడు.... అతను వచ్చేసరికి అంతా రెడీగా వుండాలి.... గెట్ రెడి....ఫినిష్ ఎవ్రీ థింగ్...." అర్జంటుగా అన్నాడు షాడో.

"దర్బార్ నాకు ఫోన్ చేయలేదు.... అసలు ఏం జరుగుతున్నది?" అయోమయంగా అన్నాడతను.

"ఓహ్....యూ బ్లడీ...అర్థం కాలేదా? మన విషయం పోలీసులకు తెలిసిపోయింది. రైడ్ జరగబోతున్నట్లు వార్తలు వచ్చాయి.... మన మనుష్యులు యిక్కడే వుండాలి. డబ్బు మాత్రం ట్రాన్స్ఫర్ అయిపోవాలి...." అసహనంగా అన్నాడు షాడో.

మధ్య వయస్సుడిలో ఖంగారు పొడ చూపింది. గిరుక్కున వెనుతిరిగి తన వారందర్నీ పిలిచాడు.

క్షణాల మీద గదిలోని సామానంతా పెద్ద పెద్ద గోతాలలోకి చేరటం ప్రారంభించింది. ఒక యువకుడు గోడకున్న స్విచ్చిని నొక్కి... గోడలో అమర్చివున్న యినుప పెట్టెను తెరిచాడు. అందులో వున్న సంపదనంతా కిందకి లాగి కాన్వాస్ సంచీల్లోకి ఎక్కించడం ప్రారంభించాడు.

"ఐదు సంవత్సరాలనుంచీ దర్బార్ దగ్గిర పనిచేస్తున్నాను. ఈ ఐదు సంవత్సరాలలోను పోలీసులు దాడి చేయటం అంటూ వార్త వినటం యిదే ప్రథమం." విచారంగా అన్నాడు మధ్య వయస్కుడు.

"డోన్ట్ వర్రీ... ప్రతీదీ ఎక్కడో ఒకచోట మొదలు కాక తప్పదు. ఏ విషయానికైనా మొదలు అంటూ ఒకటి వుండక మానదు.... అన్నట్లు వాన్ వచ్చిందా? అడిగాడు షాడో.

“వానా? ఏం వాను ?”

"వెల్ ! యూ డర్టీ డండర్‌హెడ్స్! వాన్ తెప్పించకుండా యింతసేపు ఏం చేస్తున్నారు ? ఈ మూటల్ని ఎలా బయటికి తీసుకు పోదామనుకుంటున్నారు? మీ కసలు మతులు వున్నాయా? ఆలోచన అనేది వుందా?” రైజ్ అయిపోయాడు షాడో. అతని ముఖంలోకి చూసే ధైర్యం లేక తలలు వంచుకున్నారందరూ.

సీరియస్ గా, వెనుక తలుపును కాపలాగాస్తున్న గార్డును పిలిచి "వాన్ నొకదాన్ని తీసుకురా!” అని ఆర్డర్ యిచ్చాడు షాడో.

అతను మధ్య వయస్కుడివైపు చూశాడు.

"పోలీసు రైడ్ జరగబోతోంది. వెంటనే చెప్పింది చేయి....” బంగారు అచ్చులను ఒక సంచీలో మూట కడుతూ అన్నాడతను.

రైఫిల్ రెండవ గార్డుకి యిచ్చి బిల్డింగు వెనక్కు పరుగుతీశాడు గార్డు.

రెండవ గార్డును పిలిచి "నువ్వు బయట రెడీగా వుండు. ఈ గొడవ ఎవరికీ తెలియకూడదు....” కమాండ్ చేశాడు షాడో.

ఆ గార్డు కూడా బయటికి పోయాడు. రెండు నిముషాలు బిజీగా గడిచిపోయాయి. మధ్య వయస్కుడు బంగారపు సంచుల్ని

లెక్కపెట్టుకుంటున్నాడు. లెక్క పూర్తికాగానే డబ్బు కట్టలున్న మూలకు పోయాడు.

ఒక బంగారపు సంచీని కాలితో తలుపు దగ్గిరికి తన్నాడు షాడో. చాలా బరువున్నది అది. దాదాపు పది లక్షల రూపాయలు విలువచేసే బంగారం వున్నది అందులో.

ఐదు నిముషాలు గడిచిపోయాయి. ఉన్నట్లుండి వాచి వంక చూచుకొని చిరాకుపడ్డాడు షాడో. "డండర్ హెడ్ ! ఏం చేస్తున్నాడు ! వాన్ తీసుకురావటానికి యింత టైం కావాలా?" అంటూ మరో నిముషం అటూ యిటూ పచార్లు చేశాడు ఆందోళనగా.

అప్పటికీ వాన్ రాలేదు. రాదని.... అది వచ్చేసరికి ఎలా కాదన్నా మరో ఐదు నిముషాలు పడుతుందనీ షాడో అంచనా. మధ్య వయస్కుడి వంక చూస్తూ "నేను బయటికి పోతున్నాను.... వాన్ రాగానే అంతా రెడీచేసి బయలు రండి.... ఈ లోపల దర్బార్ వచ్చినా వచ్చేస్తాడు...." అంటూ వెనుక తలుపు వైపు అడుగులు వేశాడు.

నోట్లకట్టలు లెక్కపెట్టుకుంటూ తల వూపాడు మధ్య వయస్కుడు. తలుపు తెరిచాడు. షాడో. కాలితో బంగారపు సంచీని బయటకు తన్ని..... "డామిట్..... యింత బరువున్న దేమిటి?" అని విసుక్కున్నాడు.

బయట కాపలా వున్నాడు గదిలో వుండవలసిన సెకండ్ గార్డు.

"అందులో పది లక్షలు విలువచేసే బంగారం వుంది. జాగ్రత్తగా చూస్తూ వుండు." అంటూ తలుపు మూసి సంచీని అతని దగ్గిరికి తన్ని హడావుడిగా సందులో వెళ్ళాడు. అర నిముషం పాటు అటూ యిటూ చూసి మళ్ళీ గార్డు దగ్గిరికి వచ్చాడు.

"వాన్ యింకా రాలేదు. నేను కలగ చేసుకుంటే గాని ఏ పనీ అయ్యేటట్లు కనిపించడంలేదు. జాగ్రత్తగా చూస్తూవుండు.... యిప్పుడే వస్తాను." అంటూ సంచీని చంకపెట్టుకొని గబగబా.... సీరియస్‌గా సందు చివరికి వచ్చేశాడు.

ఏమీ అర్థం కాని ఆ గార్డు.... అలాగేనంటూ అయోమయంగా నిలబడి వున్నాడు.

షాడోకి నవ్వు ఆగటం లేదు....కిల్లర్స్ గాంగ్.... తన సెక్యూరిటి విషయాల్లో అతి జాగ్రత్తలు తీసుకుంటుంది. ఏదైనా సరే అతి అయితే యిలాగే వుంటుంది.

ఈ విషయం దర్బార్‌కి తెలిస్తే అతని ముఖం ఎలా తయారౌతుందో వూహించుకుంటూ సిటీబస్‌లో కారు వదిలిన హోటల్ వైపు బయలుదేరాడు.

* * * *

ఎయిర్ కండీషన్డ్ గదిలో ఒక రివాల్వింగ్ ఛైర్ లో కూర్చుని ఫోన్ చెవికి ఆనించుకొని వున్నాడు దర్బార్. దలైలా ఆ గదిలోకి అడుగుపెట్టేసరికి ఎవరితోనో చాలా కోపంగా మాట్లాడుతున్నాడు.

అతని మూడ్ సరిగ్గా లేదని గ్రహించి.... దిగులుపడ్డాడు దలైలా...వెల్.... తను కూడా ఏమీ సాధించలేకపోయాడు. ఆ కోపం తన మీదికి కూడా ప్రసరిస్తుందేమో!!

ఫోన్‌లో విన వచ్చిన మాటలేవో దర్బార్ కోపాన్ని తారాపథానికి చేర్చాయి.

"వాట్ ! పది లక్షల రూపాయల బంగారాన్ని వెంట తీసుకుపోయాడా? మై గాడ్ ! యూ బ్లడీ డండర్ హెడ్స్ ! మీరందరూ ఏమి చేస్తున్నారు? అక్కడ అన్ని టెలిఫోన్లు పెట్టించింది దేనికి ? ఒక్కళ్ళు.... అక్కడ వున్న వందమంది బాస్టర్డ్స్ లో ఒక్క వెధవైనా నాకు ఫోన్ చేసి వుండవచ్చునే ! అసలు మీరు ఏమని అనుకుంటున్నారు ! దర్బార్ అనే వాడు చచ్చాడని భావిస్తున్నారా ?"

దలైలా మోకాళ్ళు వణకటం ప్రారంభించాయి..... దర్బార్ అంత కోపంగా మాట్లాడటం అతను అదే మొదటి సారిగా చూస్తున్నాడు.

"ఆల్ రైట్ .... మిమ్మల్ని అనవలసిన పని లేదు....మీ కంటే తెలివైన వాళ్ళనే తల్లకిందులు చేసిన రకం ఆ షాడో. - చూడండి - మన వాళ్ళందరినీ రెడీ చేయండి - కాంటాక్ నగరమంతా గాలించాలి. ప్రతీ వీధి, ప్రతి హోటలు,

అన్నీ జాగ్రత్తగా చెక్ చేయించాలి. - రేపు సాయం సమయమయ్యేసరికి షాడో తల నా టేబిల్ మీద వుండాలి అర్థం అయ్యిందా!"

అవతలివైపు మాట్లాడుతున్న వ్యక్తికి అర్థం అయింది కాబోలు - లైన్ డిస్కనెక్ట్ అయ్యింది. దర్బార్ దలైలా వైపు తిరిగాడు.

"చూశావా.... విమానంలో అరటిపండులా దొరికిన షాడోని నీ అనుచరులు వదిలిపెట్టటం వలన వచ్చిన బాధ యిదంతా- - ఆ దుర్మార్గుడు ట్రేడిల్‌కి పోయి అందరూ చూస్తుండగా పదిలక్షల రూపాయలు బంగారాన్ని వెంట తీసుకుపోయాడు..."

"దర్బార్ సాబ్ !" అంటూ అతని మాటలకు అడ్డు వచ్చాడు దలైలా.

షాడోని గురించి దర్బార్‌కి వివరంగా చెప్పాలని అతని తాపత్రయం. కాని నోరు మూసుకోమని సైగ చేశాడు దర్బార్.

"భూటాన్ నుంచీ, నేపాల్ నుంచీ నలుగురు స్నేహితులు వచ్చారు. ఈ మూడు దేశాల్లో వున్న గాంగ్‌లను కలిపి ఒకే గాంగ్‌గా తయారు చేయాలని ప్లాన్. షాడో వల్ల మొత్తం ప్లానంతా పాయయింది. దుర్మార్గుడు - - దలైలా.... నాతో యిక మాట్లాడవద్దు, షాడోని భూస్థాపితం చేసి ఆ తరువాత కనిపించు. షాడో నీ రెస్పాన్సిబిలిటీ. ఈ సారి కూడా తప్పటడుగు వేశావంటే - - గాంగ్‌లో నీకున్న పొజిషన్‌ని గురించి నేను కొంచెం తీవ్రంగా ఆలోచించాల్సి వస్తుంది. "

నిరుత్తరుడై బయటికి వచ్చాడు దలైలా - - ఇంతకాలం విశ్వాసంగా సేవ చేసినందుకు ఫలితమాయిది.

సడన్‌గా అతని భార్య రోజు చేసే ప్రార్థనలు మదిలో మెదిలి బరువెక్కింది అతని హృదయం.

తను గాంగ్ కోసం ఎన్నో హత్యలు చేశాడు. ఎంత మందినో హతమార్చాడు. ఆ సేవలకు ప్రతిఫలం.... షాడోని పట్టుకోలేకపోతే.

ఆలోచించలేకపోయాడు దలైలా. ఆపైన ఒక హోటల్‌లో ఆగి - తన అనుచరులకు - చావగా మిగిలిన నలుగురికి ఫోన్ చేశాడు.

* * * *

సాయంత్రం నాలుగు గంటలకు హోటల్‌కి చేరుకున్నాడు షాడో. బంగారపు సంచీని ఫియట్ ముందు సీటు కింద దాచి - - మళ్ళీ కాలినడకన సిటీలోకి బయలుదేరాడు.

తను చేసిన పని దర్బార్‌కి తెలుస్తుంది. ఏదో ఒకటి చేయటానికే ప్రయత్నిస్తాడతను. అతను ఏం చేస్తాడో చూసుకొని ఆ తర్వాత తను వేయవలసిన అడుగు - నిర్ణయించుకోవాలి. చీకటి పడేదాక బజార్లలో కాలక్షేపం చేసి ఒక సినిమా థియేటర్ లోకి పోయాడు షాడో.

సినిమా మొదలు కాబోతున్న తరుణంలో - - ఎందుకో అనుమానం వచ్చి పక్కకు చూశాడు.... రెండు సీట్ల అవతల నిలబడి వున్నాడు. తను

అంతకు ముందు దలైలా ఇంటి వద్ద చూసిన ధృఢకాయుడు. ఎవరి కోసమో వెతుకుతున్నట్లుంది అతని వరస చూస్తుంటే.

కామ్‌గా రివాల్వర్‌ని బయటకు తీశాడు షాడో.

తెరమీద నాయకుడు ప్రత్యక్షమై వున్నాడు. కత్తి పుచ్చుకొని ఆవేశంగా ఏవో డైలాగులు వదులుతున్నాడు.

అతని నోటికేసి గురిపెట్టి కాల్చాడు షాడో. నాయకుడి నోరు వున్న చోట తెర చిల్లిపడింది. దానితో పాటు లోపల వున్న మైక్ బాక్స్ కూడా దెబ్బతింది. నాయకుడి గొంతు మూగపోయింది. జనంలో కలకలం బయలుదేరింది.

ఆ సందడిలో చల్లగా లేచి బాల్కనీలోకి పోయాడు షాడో. మెట్ల మీదినుంచి కిందికి దిగి..... ఏదైనా హోటల్‌కి వెళ్ళిపోదామని అతని వుద్దేశ్యం.

రెండు అడుగులు కూడా వేయకముందే ముగ్గురు వ్యక్తులు మెట్ల క్రింద ప్రత్యక్షమైనారు. వారిలో ఎపార్ట్‌మెంటు దగ్గిర షాడో చేతిలో దెబ్బతిన్న కారు డ్రయివర్ కూడా వున్నాడు.

షాడోని చూడగానే రివాల్వర్లు తీశారు వారందరూ....బుల్లెట్లు షాడో చెవుల పక్కనుంచి దూసుకుపోవటం ప్రారంభించాయి. ఎగిరి వెనక్కు దూకాడు షాడో. క్రిందపడి దొర్లుకుంటూ అవతలి పక్కకు పోయాడు.

రివాల్వర్ శ్రోతలు అందర్నీ ఆకర్షించటం ప్రారంభించాయి. థియేటర్‌లో కలకలం చెలరేగింది. థియేటర్ యజమానులు పోలీసులకు ఫోన్ చేసినట్లున్నారు. దూరంలో పోలీస్ జీపులు వస్తున్నట్లు సైరన్లు వినిపించాయి.

బాల్కనీకి వున్న పిట్టగోడ మీదనుంచి జంప్ చేసి పారాపెట్ మీదికి పోయాడు షాడో. అక్కడనుంచి థియేటరు పక్కన వున్న సైకిలు స్టాండ్ షెడ్ మీదికి దూకాడు.

అదే సమయంలో దలైలా బాడీగార్డు అక్కడికి వచ్చాడు. తప్పించుకునే దారి లేక రివాల్వర్‌ని అతనికేసి గురిపెట్టాడు షాడో.

అప్పుడే పోలీస్ జీపులు థియేటరు ఆవరణలోకి వచ్చాయి.

షాడో వదిలిన బుల్లెట్ బాడీగార్డు చెవిని ముద్దు పెట్టుకుంది. బాధగా అరిచి ప్రక్కకు దూకాడతను.

"పోయి నీ బాస్‌కు చెప్పు.... నన్ను చంపించటానికి యిది రెండో ప్రయత్నం. ఇక అతని రోజులు చెల్లిపోయాయని వివరించు...." అంటూ సైకిల్ షెడ్ మీదినుంచి అవతలికి దూకి ఒక సందులో మాయం అయ్యాడు షాడో.

కమ్ముకు వస్తున్న పోలీసులను గమనించి బాడీగార్డు కూడా షాడో వెళ్ళిన మార్గాన్నే అనుసరించాడు.

ఒక ఫాన్సీ షాపు ముందు ఆగి.... దలైలాకు ఫోన్ చేసి షాడో చెప్పమన్న మాటల్ని యథాతథంగా వివరించి చెప్పాడు.

* * * *

రాత్రి పన్నెండు గంటలకు మటాకా ఏరియాను సమీపించాడు షాడో. దూదిపింజలు గాలిలో ఎగిరినట్లు కురుస్తున్నది మంచు. చల్లగాలి ఎముకలను కొరుక్కు తింటున్నది.

పనామా వెలిగించుకొని గుండెలనిండా పొగపీల్చి వదులుతూ దలైలా ఇంటి ముందున్న చెట్టుకింద కూర్చున్నాడు.

దలైలా భవనం అంధకారంలో మునిగివుంది. లోపల ఎవరూ లేనట్లు అగుపిస్తున్నది.

అరగంట సేపు ఆగి మెల్లిగా గేటు దాటి లోపలికి పోయాడు. నిర్మానుష్యంగా వుంది ఆవరణ అంతా, ముందు ద్వారం తాళం వేసి వుంది.

ఆలోచనలతో ముడిపడింది షాడో భృకుటి. సిగరెట్ బూటుకింద నలిపి, గారేజి పక్కన వున్న పొద చాటున కూర్చున్నాడు.

దలైలా ఏమయ్యాడు? అడ్రసులు మార్చాడా?

మరో అరగంట గడిచిపోయింది చూస్తుండగానే.... చలి గాలి షాడో అవయవాలను మొద్దుబారిపోయేటట్లు చేస్తున్నది. మంచుపడి చొక్కా తడిసిపోయింది. బూట్ల మీద అరంగుళం ఎత్తున మంచు పేరుకున్నది.

అయినా కూర్చున్న చోటు నుంచి కదలలేదు షాడో. తెల్లవారేదాకా అక్కడే వుండి.... దలైలా విషయం డెఫినిట్‌గా తేల్చుకొనటానికే నిశ్చయించుకున్నాడు.

రెండు గంటలు చూపించింది షాడో చేతికున్న రిస్ట్ వాచి. సరిగ్గా అదే సమయానికి ఒక అంబాసిడర్ కారు వచ్చి భవనం ముందు ఆగింది.

సిగిరెట్ వెలిగించుకోబోతున్నాడు షాడో. చటుక్కున లైటర్‌ని , సిగరెట్‌నీ పాంటు జేబులోకి తోసి, పొదల చాటుకు జరిగాడు.

గేటు తెరుచుకుంది. కారు లోపలికి వచ్చి గారేజి ముందు నిలబడింది. స్టీరింగ్ ముందున్న ధృఢకాయుడు కిందికి దిగి గారేజి తలుపులు ఓపెన్ చేయటానికి వచ్చాడు.

పెద్దపులిలా లేచాడు షాడో. పొదల మీదినుంచి జంప్ చేసి ఒక్కగంతులో అతన్ని సమీపించాడు. ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని అతను గుర్తించే లోపుగానే ఇనుపచువ్వలా గాలిలోకి లేచింది షాడో కుడిచేయి. పాతిక పౌండ్ల సుత్తిలా అతని మెడమీద పడింది. అతని తల దిమ్మెక్కిపోయింది. ఆ దెబ్బతో, స్పృహ తప్పి గారేజికి అడ్డంగా పడిపోయాడు.

అదే వూపులో బెల్టు వెనుక నుంచి రివాల్వరుని లాగి, కారు వెనుక సీటులో వున్న వారిని కవర్ చేశాడు షాడో.

కారులో దలైలా, అతని భార్య వున్నారు.

రివాల్వరుని గురిపెట్టి..... బ్రహ్మ రాక్షసుడిలా నిలబడి వున్న షాడోని చూడగానే దలైలా ప్రాణం సగం చచ్చిపోయింది.

"దలైలా ! నీ పని అయిపోయింది...." తూచి తూచి అన్నాడు షాడో.

పాలిపోయిన ముఖంతో కారు దిగి షాడో ఎదుట నిలబడ్డాడు దలైలా. అతని భార్య నీరు నిండిన కళ్ళతో షాడో వంక చూసింది.

షాడో గుండెల మీద పెద్ద బరువు పడినట్లయింది.... జరగబోతున్న ది ఏమిటో ఆమెకు తెలుసు.....

"దలైలా ఒక నర రూప రాక్షసుడు కావచ్చు. కాని అతని భార్య వట్టి అమాయకురాలు.... భర్త ఎంత కర్కోటకుడైనా.... భార్యకు దేవుడిలాంచివాడు. రాజు.... కొంచెం ఆలోచించు...." సందు చూసుకొని షాడో అంతరాత్మ చిన్న గా హెచ్చరించసాగింది.

"బయట నిలబడి మాట్లాడుకోవటం దేనికి ? కాఫీ తయారు చేస్తాను - - లోపలకు రండి - - " అంటూ షాడో వంకా, రివాల్వరు వంకా ఒకసారి చూసి వెనుతిరిగింది దలైలా భార్య.

ఆమె బుగ్గల మీదికి జారుతున్న కన్నీ ళ్ళు - షాడో కంట పడ్డాయి. అతి ప్రయత్నం మీద గుండె రాయి చేసుకున్నాడు షాడో. దలైలా మూలకంగా ఎంత మంది ప్రాణాలు కోల్పోయారో గుర్తుకు తెచ్చుకొన్నా డు.

"మిస్టర్ షాడో! నువ్వు నాకోసం వస్తావని తెలుసు అందుకే కాన్వెంటుకి పోయి నా పిల్లల్ని ఆఖరుసారిగా చూసుకొని వస్తున్నాను. చావుకు నేను భయపడటం లేదు. కాని ఒక చిన్న రిక్వెస్ట్." మెల్లిగా అన్నాడు దలైలా.

ఏమిటన్నట్లు చూశాడు షాడో.

"మిస్టర్ షాడో ! నా భార్య చూడలేని చోటుకు పోదాం. నీపని అక్కడ ఫినిష్ చేసుకుందువుగాని....."

కనుచివరలనుంచి ఇంటి వైపు చూశాడు షాడో. కిటికీ దగ్గర నిలబడి వుంది దలైలా భార్య. పమిటె చెంగుతో కనులు అద్దుకుంటున్నది.

"దలైలా! ఆయుధాలేమైనా వున్నాయా?" నిర్వికారంగా అడిగాడు షాడో.

కుడిచేతిని నెమ్మదిగా కోటులోనికి పోనిచ్చి చిన్న పిస్టల్‌ని తీశాడు దలైలా - షాడో పాదాల ముందుకు విసిరేసాడు.

"నువ్వు మంచి మార్గంలో నడుచుకుంటే చాలా బాగుంటుంది దలైలా.... పరుల ప్రాణాలతో చెలగాటాలాడితే ఆ భగవంతుడు కూడా క్షమించడు."

షాడో మాటలకు నిర్లిప్తంగా నవ్వాడు దలైలా. ఆ రోజు దర్బర్ బంగ్లాలో జరిగిన సంభాషణ అతని మనస్సులో మెదిలింది.

"అదే నిశ్చయానికి వచ్చాను.... కాని అవకాశం వున్నట్లు కనపించటం లేదు...." అన్నాడు.

షాడో మనస్సులోకి ఒక నిర్ణయం రూపు దిద్దుకొంది.

"ఆల్‌రైట్ దలైలా ! నీకు ఒక్క అవకాశం మాత్రమే యిస్తున్నాను. నీ ముఖం చూసి జాలిపడటం లేదు. నీ భార్య పిల్లల కోసం.... ఈ సారికి నిన్ను వదిలిపెడుతున్నాను. మంచిగా జీవితం కొనసాగించు, మళ్ళీ పాడుపనులు చేయటం ప్రారంభించావంటే, ఆ పైన నిన్ను రక్షించటం యీ ప్రపంచంలో ఎవరికీ సాధ్యపడదు. వెళ్ళు.... నీ భార్య నీ కోసం ఎదురు చూస్తున్నది...." రివాల్వర్ ని బెల్టు వెనక్కి పంపిస్తూ అన్నాడు.

తాగిన వాడిలా తూలుతూ వెనక్కి తిరిగాడు దలైలా..... ముఖద్వారం దగ్గరికి వెళ్ళి ఒకసారి వెనక్కి చూశాడు.

లోపలనుంచి అతని భార్య బయటకి పరిగెత్తుకు రావటం షాడోకి కనిపించింది. దలైలాను కౌగలించుకొని విలపిస్తున్నదామె.

గిరుక్కున వెను తిరిగి చీకట్లలో కలిసిపోయాడు షాడో ఏమయింది తనకు? ఎందుకిలా సాఫ్ట్ గా మారిపోయాడు! దలైలాను క్షమించి వదలటం దేనికి?

"మంచి పని చేశావ్ రా ! కొన్ని కొన్ని సమస్యలకు చావు పరిష్కార మార్గం కాదు రాజు.... దలైలా విషయంలో నీ డెసిషన్ చాలా బాగుంది" మెచ్చుకుంది షాడో అంతరాత్మ షాడో గుండెల మీది బరువు తొలగిపోయినట్లయింది.

* * * *

తెల్లవారుఝూమున మూడు గంటలకు సోనీ ఎపార్ట్‌మెంట్‌ని సమీపించాడు షాడో.

కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తెరుచుకొన్నది. నైట్ డ్రస్ వేసుకొన్న రాకీ తలుపు తెరిచింది. షాడోను చూడగానే ఆమె ముఖం వికసించింది. చటుక్కున అతన్ని లోపలకు లాగి తలుపు గడియపెట్టింది.

"అసలు నీ వుద్దేశ్యం ఏమిటి? నిన్ను చచ్చీ చెడీ తీసుకువచ్చి అష్టకష్టాలు పడి రక్షించింది యిందుకేనా? " నడుము మీద చేతులు వుంచుకొని సీరియస్‌గా అడిగింది.

నవ్వుతూ ఆమె బుగ్గ మీద చిటికె వేసి "మిగిలిన ఇద్దరు దేవకన్యలూ ఎక్కడ ?" అని అడిగాడు షాడో.

ఆ మాట వినగానే మాలిని బయటకు వచ్చింది.

"రాజు.... గదంతా చెల్లాచెదురుగా వుంది.... నేల మీద రక్తపు మరకలు కనిపించాయి. నీకేమైనా ప్రమాదం వాటిల్లిందేమోనని భయపడ్డాం. సోనీ యింకా తిరిగి రాలేదు" మెల్లిగా చెప్పింది.

సోనీ యింటికి తిరిగి రాలేదా?

అదిరిపడ్డాడు షాడో..... అసలు సోనీ బయటకు వెళ్ళాల్సిన అవసరం ఏముంది?

"నువ్వు కనిపించకపోవడంతో చాలా గాబరా పడింది రాజు.... తన మూలంగా నీకు ప్రమాదం వచ్చి పడిందని బాధతో...." అంటున్నది రాకీ.

షాడో మెదడు రంగుల రాట్నంలా తిరగసాగింది. రాకీ భుజాలు పట్టుకొని గట్టిగా కుదిపి.... జరిగిన విషయం క్లియర్ గా చెప్పమన్నాడు.

నెమ్మదిగా ఒక్కొక్క విషయం బయటికి వచ్చింది.

ఆరోజు సోనీ కాలేజిలో కొంచెం అతిగా, అనవసరమయిన మాటలు మాట్లాడిందట. స్టూడెంట్స్ యూనియన్ లీడర్సులో కొందరు సోనీకి స్నేహితులు. వారితో తాము ఒక వ్యక్తిని రక్షించి, ప్రాణదానం చేసిన సంగతి వెల్లడించిందట గొప్ప కోసం.

ముగ్గురూ ఆరు గంటలకు యింటికి తిరిగి వచ్చారు.... బెడ్ రూమ్ లో రక్తపు మరకలు అస్పష్టంగా కనిపించాయి. షాడో వదిలిన ఎయిర్ బాగ్

మంచం పక్కన కనిపించటం, షాడో మాయం కావటం వారిని దిగ్భ్రాంతులను చేసింది.

సోనీకి తన తప్పు తెలిసి వచ్చింది. తను అతిగా వాగటం షాడోకి ప్రమాదం తెచ్చి పెట్టిందని గ్రహించి, మళ్ళీ ఆ స్నేహితుల దగ్గరికి వెళ్ళింది. తను చెప్పిన విషయాలు మరి ఎవ్వరికీ చెప్పవద్దని ప్రార్థించడానికి.

ఎనిమిది గంటలకు వెళ్ళిన మనిషి..... మూడున్నర కావస్తున్నా తిరిగి రాలేదు.

దీర్ఘంగా నిట్టూర్చాడు షాడో. తన విషయం బయటపడటం వల్ల ప్రమాదం తనకు కాదు.... వారు ముగ్గురికీ వస్తుంది.

తెల్లవారగానే సోనీ విషయం తెలుసుకోవాలి. ఒకవేళ లేట్ అయిపోయిందని ఏ స్నేహితుల ఇంట్లోనో గడిపి....తెల్లవారగానే ఆమె ఎపార్టుమెంట్ ని చేరుకోవచ్చు....

"ఆల్ రైట్ బేబీ.... నేను తర్వాత కనిపిస్తాను...." అంటూ బయటికి దారి తీశాడు - - తన అనుమానాలను తనలో నే దాచుకుంటూ.

మరుక్షణం దారికి అడ్డంగా నిలబడ్డారు వారిద్దరూ. "నథింగ్ డూయింగ్ మిస్టర్ రాజు! నువ్వు యిక్కడే వుండాలి. లేదా మేము నీతో రావాలి....." అన్నారు ఏక కంఠంతో.

మాలిని షాడో ఎడమచేయి పట్టుకుంది. రాకీ కుడిచేతిని ఆశ్రయించింది. వారి పట్టునుంచి బయటపడేసరికి షాడో తలప్రాణం తోకకు వచ్చింది.

తనతో తిరగటం వారికి మంచిది కాదు. తను అక్కడ వుండటం కూడా ఏమంత మంచిది కాదు. గాంగ్ అనుచరులు ఎవరైనా చూస్తే ప్రాణాపాయం ఎదురౌతుంది.

"రాకీ - - నా మాట వినండి. తెల్లవారేలోగా సోనీ వస్తే ముగ్గురూ కలిసి కొంతకాలం ఎక్కడికైనా పోయిరండి. సోనీ రాకపోతే - - మీరిద్దరూ ఏదైనా హోటల్లో గది తీసుకోండి. ఈ ఎపార్టుమెంట్‌లో మీరు వంటరిగా వుండటం మంచిది కాదు...." అని చెప్పి - - వారిని సముదాయించి బయటపడేసరికి నక్షత్రాలు కనిపించాయి అతని కళ్ళకు.

మెల్లిగా అడుగులు వేస్తూ - - మటాకా ఏరియాలో చూసిన ఒక పార్కు వైపు బయలుదేరాడు.

* * * *

ఆ రోజు - షాడో ఎపార్ట్‌మెంట్‌లో కనిపంచకపోయేసరికి సోనీ పై ప్రాణాలు పైనే పోయాయి. గిరుక్కున వెను తిరిగి టాక్సీలో తన స్నేహితుని యింటికి పోయింది.

టేబిల్ ముందు కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడతను. "బేలూ - - నేను రాజును గురించి చెప్పిన మాటల్ని మర్చిపో - - యింకెక్కడా అనకు - - " అంటూ సుడిగాలిలా వచ్చిపడిన సోనీని చూసి అదిరిపోయాడు.

జరిగింది అంతా విని అలాగేనని మాట యిచ్చాడు. తేలిక పడిన మనస్సుతో వెను తిరిగింది సోనీ.

కాని అప్పటికే ఆ విషయం బేలూ నోటినుంచి మరికొన్ని చెవులకు చేరిందని ఆమెకు తెలియదు. ఆ విషయం బేలూకు కూడా జ్ఞాపకం లేదు.

టాక్సీ మెయిన్ రోడ్ మీదికి వస్తుండగా రెండు నీలంరంగు అంబాసిడర్లు అడ్డం వచ్చాయి. వాటిని చూడగానే అదిరిపడి టాక్సీని ఆపు చేశాడు డ్రయివర్. ఆపు చేయటమే కాదు - కిందికి దూకి పారిపోయాడు.

నీలంరంగు కార్లలోనుంచి నలుగురు వ్యక్తులు దిగి వచ్చి టాక్సీ ఎక్కారు. ఒక వ్యక్తి స్టీరింగ్ ముందు కూర్చుని టాక్సీని కదిలించాడు.

సోనీకి ఏమీ అర్థంకాలేదు. "ఎవరు మీరు? ఏమిటి ఈ అక్రమం ?" అంటూ టాక్సీని ఆపమని గద్దించింది.

"మిస్..... గొడవ చేయకు" గద్దించాడొక వ్యక్తి.

సోనీ మనస్సు భయంతో నిండిపోయింది. టాక్సీ మెయిన్ రోడ్‌లో పోతున్నది. రోడ్డు నిండా జనం వున్నారు.

అరచి గొడవ చేస్తే వారికి వినిపిస్తుంది. టాక్సీ ఆగక తప్పదు.

అరవటానికి నోరు తెరిచిందామె.

మరుక్షణం ఒక చెయ్యి ఆమె నోరు మూసింది. గింజుకున్నది సోనీ. ప్రయోజనం లేకపోయింది. అరగంట తరువాత ఒక పెద్ద భవనం ముందు టాక్సీ ఆగింది.

ఆమెను భుజం మీద వేసుకొని లోపలకు తీసుకుపోయాడొక వ్యక్తి. మిగిలిన వారు ముఖద్వారం మూసి గడియలు బిగించారు.

సోనీని ఒక కుర్చీలో కూర్చోబెట్టారు.

"ఆల్ రైట్ డార్లింగ్.... నీ యింట్లో వుంటూ వచ్చిన మనిషిని గురించి నీకు తెలిసిన విషయాలు చెప్పు...." మృదువుగా అడిగాడొకడు.

తను చేసిన పొరపాటు ఎటువంటిదో ఆ క్షణంలో సోనీకి బాగా అర్థమయింది.

అనాలోచితంగా నోరు జారింది. రాజు ప్రాణాలకు ముప్పు తెచ్చిపెట్టింది. ఇక మీదట అటువంటి పొరపాటు జరుగకూడదు. రాజును గురించి మాట్లాడనే కూడదు.

"నాకు తెలియదు..... నేను గొప్పకోసం అలా మాట్లాడాను. అన్నీ అబద్ధాలు.... అసలు నా యింట్లో ఎవరూ లేరు." అన్నది కామ్‌గా.

"డియర్.... సానిదాని కన్నా దారుణంగా అసత్యాలు పలుకుతున్నావ్ ! మంచిది కాదు...." సీరియస్‌గా అన్నాడొక వ్యక్తి.

సోనీ ముఖం ఎర్రబడింది ఆ మాటతో, "నీ కంటే ఆ సానిదే లక్ష రెట్లు నయం. కష్టపడి డబ్బు సంపాదించుకొంటుంది. నీలా హత్యలు చేసి పొట్ట నింపుకోదు...." అన్నది కోపంగా.

కొరడా పెట్టి కొట్టినట్టు వులిక్కిపడ్డాడా వ్యక్తి.

"నేను హత్యలు చేస్తానని నీతో ఎవరు చెప్పారు?" కోపంగా అడిగాడు.

నీ ముఖం చూస్తుంటేనే తెలుస్తోంది."

మాట అన్న మరుక్షణం సోనీ చెంప చెళ్ళుమన్నది.

"పిచ్చి మాటలు మాని షాడో ఎక్కడ వున్నాడో చెప్తావా? లేదా?" గద్దించాడొకడు.

"నాకు తెలియదు."

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు వారందరూ.

"బాస్‌ని లేపటం కంటే వేరే దారి లేదు." తన అభిప్రాయం వెల్లడించాడొకడు.

తలవూపి లోపలి గదిలోకి దారి తీశాడు అనుచరుడు.

* * * *

"బాస్ ! బాస్ !! అన్న పిలుపు వినరావటంతో తలుపు తెరిచాడు దర్బార్.

ద్వారం దగ్గిర అతని బాడీగార్డు నిలబడి వున్నాడు.

"బాస్....మన వాళ్ళు ఒక పిట్టను పట్టుకొచ్చారు. షాడో ఎక్కడ వున్నదీ ఆమెకు తెలుసని అనుకుంటున్నారు." అని రిపోర్టు చేశాడు.

ఆదరాబాదరాగా డ్రస్ చేసుకున్నాడు దర్బార్. తన రూమ్ కి నాలుగు గదుల ఆవల వున్న హాల్లోకి వెళ్ళాడు.

అక్కడ నలుగురు అనుచరులు నిలబడి వున్నారు. వారి మధ్య ఇరవై సంవత్సరాల వయస్సున్న యువతి బెదురు చూపులతో ఒక కుర్చీ మీద కూర్చుని వుంది.

"నీ పేరేమిటి?" చూడగానే కరుకుగా అడిగాడు దర్బార్.

"సోనీ"

"షాడో ఎక్కడ వున్నాడు?"

విశాలమైన కళ్ళను మరింత పెద్దవి చేసి చూసిందామె.

"బాస్ - - ఎంత ప్రయత్నించినా మాట్లాడలేదు - -" అందించాడొక అనుచరుడు. డ్రాయర్ తెరిచి ఒక కొరడాను అందుకున్నాడు దర్బార్. ఉన్నట్లుండి గాలిలోకి విదిలించి బలంగా ఆమె భుజాలమీదికి విసిరాడు.

సోనీ జాకెట్ బద్దలై పోయింది. పాలరాతి వంటి ఆమె శరీరం మీద ఎర్రటి వాత ప్రత్యక్షమయింది.

"షాడో ఎక్కడ వున్నాడు?" ఒక్కొక్క పదాన్ని నొక్కి నొక్కి పలుకుతూ అడిగాడు దర్బార్.

సోనీ వదనం బాధతో నల్లబడిపోయింది. పెదిమలు బిగించి తెలియదన్నట్లు తల తిప్పింది.

మళ్ళీ గాలిలోకి లేచింది దర్బార్ చేతిలోని కొరడా. సోనీ శరీరం మీద లెక్కలేనన్ని వాతలు ప్రత్యక్షమయ్యాయి. కుర్చీలోనుంచి కింద పడిపోయింది.

అప్పటికీ ఆమె నోటినుంచి ఒక్క మాట కూడా బయటికి రాలేదు.

ఆవేశంతో ఎగిరిపడుతూ కొరడాను గది మూలకు విసిరేశాడు దర్బార్.

"మంచి మాటలతో, సామాన్యమైన బాధలతో యీ పిట్ట మనకు కావల్సిన విషయాన్ని బయటపెట్టదు. తీసుకుపోయి మన దెబ్బ పూర్తిగా రుచి చూపించండి." అన్నాడు.

వెంటనే సోనీ కాళ్ళు చేతులు పట్టుకుని అవతలి గదిలోకి లాక్కుపోయారు అతని అనుచరులు.

సగం కాల్చిన సిగరెట్ నొకదాన్ని ఆమె మీద ఆనించి " వెల్ బేబీ - - ఇక చెప్పు - - నీ డార్లింగ్ షాడో ఎక్కడ?" అని ప్రశ్నించాడొక అనుచరుడు.

చర్మం కాలి - - కమురు కంపు సోనీని ఉక్కిరి బిక్కిరి చేసింది. బాధ ఆమె నవనాడులను స్తంభింపజేసింది.

సిగిరెట్ రెండవసారి ఆమెమీదికి మరలింది.

కెవ్వున అరిచింది సోనీ.... "రాజూ - - రాజూ - -" అంటూ స్పృహ తప్పి తల వాల్చేసింది.

* * * *

అదిరిపడి లేచి కూర్చున్నాడు షాడో. సూర్యుడు రెండు బారలు పైకి వచ్చాడు. వంటిమీద పేరుకున్న మంచు కరిగిపోయి దుస్తులు తడితడిగా వున్నాయి.

దలైలా బంగ్లానుంచి బయలుదేరి సోనీ వాళ్ళ ఎపార్ట్మెంట్‌కి పోయి అక్కడనుంచి తిరిగివచ్చి ఒక పార్కులో ఆ రాత్రి గడపటానికి నిశ్చయించుకున్నాడు. బెంచిమీద పడుకోగానే నిద్రపట్టింది . ఆ నిద్రలో ఏదో పీడకల - -

ఏమిటో అర్థం కావటంలేదు. ఏదో తెలియని బాధ అతన్ని నిలువనీయటం లేదు. పార్కులోనుంచి బయటికి వచ్చాడు. అప్రయత్నంగా కనిపించిన రోడ్డు మీద అడుగులు వేశాడు. అరగంట తరవాత మళ్ళీ దలైలా యింటిని సమీపించాడు.

చాలా బిజీగా వున్నాడు దలైలా - - అతను, అతని భార్య కలిసి సామాన్లు సర్దుకుంటున్నారు.

ద్వారంలో నిలబడిన షాడోని చూడగానే దలైలా ముఖంలో అనేక రకాల భావాలు చోటు చేసుకున్నాయి.

చేతిలోవున్న సూట్ కేస్‌ని కిందపెట్టి నిరారుగా నిలబడ్డాడు. "మిస్టర్ షాడో... నీ సలహా పాటిస్తున్నాను. ఈ రాత్రికే గుజరాత్ స్టేట్‌కి వెళ్ళిపోతున్నాను. అక్కడ నా బంధువులున్నారు! వారు నాకు సాయం చేసి - - పోయిన నా మానవత్వాన్ని తిరిగి సంపాదించుకునేటందుకు తోడ్పడతారు." అన్నాడు.

షాడో మనసు మార్చుకొని తనను పైకి పంపించటానికే వచ్చాడని భావించాడతను. అతని భావాలను అర్థం చేసుకుని నవ్వుతూ తల అడ్డం తిప్పాడు షాడో.

"దలైలా - - నీ బాస్ దర్బార్ ఎక్కడ వుంటాడో చెప్పగలవా?" అని అడిగాడు.

షాడోని చూడగానే లోనికి పరుగు తీసింది దలైలా భార్య. కప్పునిండా వేడివేడి టీతో తిరిగి వచ్చింది.

"షాడో భయ్యా - - నా భర్తను మార్చాలని వివాహం అయిన దగ్గర్నించీ నేను చేయని ప్రయత్నం అంటూ లేదు. ఈ నాటికి నా కోరిక నెరవేరింది. నీ దయవల్ల మేము ఈ నరకంలో నుంచి బయటపడే అవకాశం లభించింది భయ్యా - - నువ్వొక రాక్షసుడివని అందరూ అన్నారు. ఆ మాటలు నిజమనే నమ్మాను. కాని భయ్యా - - నీ రాక్షస రూపం కింద వెన్నలాంటి హృదయం వుండదనీ - - ఆడపడుచు కన్నీటికి అది యిచ్చే విలువ అసమాన్యమనీ ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. నీ ఋణం ఎలా తీర్చుకోగలం ?" అన్నది గద్గద స్వరంతో.

సిగ్గుతో షాడో ముఖం ఎర్రబడిపోయింది. రెండు గుక్కల్లో టీ తాగి బయటికి వచ్చాడు.

గేటు దాకా వచ్చాడు దలైలా.

"మిస్టర్ షాడో !... దర్బార్ కి కాంటాక్ లో నాలుగు అడ్రసులు వున్నాయి. ఎప్పుడు ఎక్కడ వుంటాడో చెప్పటం చాలా కష్టం. నువ్వు విచారించి స్వయంగా తెలుసుకోవాల్సిందే." అంటూ నాలుగు అడ్రసులు చెప్పాడు.

జాగ్రత్తగా వాటిని మననం చేసుకున్నాడు షాడో.

దలైలా రెండు క్షణాలు తటపటాయించి "మిస్టర్ షాడో.... ఈ రోజు ఉదయం బాస్ నాకు ఫోన్ చేశాడు. సోనీ అనే పిట్ట వారికి దొరికిందట. ఆమెను హింసించి నీ అడ్రసు సంపాదించబోతున్నామన్నాడు." అని చెప్పాడు మెల్లగా.

కొరడా పెట్టి కొట్టబడినట్లు ఫులిక్కిపడ్డాడు షాడో. వెంటనే వెనుతిరిగి రోడ్డు మీదికి పరుగు తీశాడు.

ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయిన దలైలాకు.... షాడో మనస్సులో చెలరేగుతున్న ప్రళయం ఎలా అర్థం అవుతుంది?

* * * *

సరాసరి ఫియట్ కారు వదిలిపెట్టిన హోటల్‌కి పోయాడు షాడో. అతన్ని చూడగానే నవ్వుతూ ఎదురు వచ్చాడు వాచ్‌మన్.

"కారు తీసుకుపోతారా సాబ్?" అన్నాడు శాల్యూట్ చేస్తూ.

అతని చేతిలో కొంత డబ్బు పెట్టి కారును రోడ్డు మీదికి తీసుకు వచ్చాడు షాడో. దలైలా చెప్పిన అడ్రస్సుల్లో ఒకటి అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలోనే ఒక చిన్న సందులో వుంది.

సందు మొదట కారాపి డిక్కీ తెరిచాడు. ఒక ఆటోమేటిక్ మిషిన్ గన్, పది హేండ్ బాంబులు మాత్రం తీసుకుని సందులోకి వెళ్ళాడు.

పెద్ద ఆవరణ....దాని మధ్య రెండంతస్తుల కాంక్రీట్ భవంతి కనిపించాయి. దర్బార్ అనుచరులు ఆవరణలో లేరు. ఒకవేళ వున్నా .... కేర్ చేసే పరిస్థితిలో లేడు షాడో. సోనీ తన మూలంగా దర్బార్‌కి చిక్కింది. ఏమీ తెలియని అమాయకురాలు. తన్ను కాపాడి.... అనవసరంగా ఆపదలను ఆహ్వానించుకుంది. ఆమెకు ఏదయినా జరిగితే తన తప్పు కింద వస్తుంది.

మిషన్ గన్‌ని రెడీగా పట్టుకొని భవనంలోకి అడుగు పెట్టాడు. ముందున్న హాల్లో నలుగురు వ్యక్తులు కూర్చుని పేక ఆడుతున్నారు.

"దర్బార్ ఎక్కడ ?" ఖంగుమన్నది షాడో కంఠం.

అదిరిపడి తలలు ఎత్తారు వారు. ఇద్దరు అప్రయత్నంగా తమ రివాల్వర్ల మీద చేతులు వేశారు.

తమ ప్రశ్నకు సమాధానం వచ్చేవరకూ షాడో ఆగదలుచుకోలేదు. నిర్దాక్షిణ్యంగా ఫైరింగ్ ఓపెన్ చేశాడు.

నిప్పులు కురిపించింది ఆ మిషన్ గన్. దాని బారినపడి నలుగురూ హతమారిపోయారు.

గబగబా లోపలి గదులలోకి వెళ్ళాడు షాడో. సోనీ అతనికి అగుపించలేదు. అసలు హతమారిన ఆ నలుగురు తప్ప మరెవ్వరూ అక్కడ లేరు.

వెంట తెచ్చిన హేండ్ బాంబు నొకదాన్ని భవనం వెనుక వున్న గదిలోకి విసిరి బయటికి పరుగెత్తుకు వచ్చాడు.

చెవులు చిల్లులుపడే శబ్దంతో పేలిపోయిందది. భవనం వెనుక భాగం సమూలంగా నాశనమై పోయింది.

గేటు ముందు నిలబడి మరో నాలుగు బాంబులను భవనం మీదికి విసిరి పరుగు అందుకున్నాడు షాడో.

ఫియట్‌లో కూర్చుని వంద గజాల దూరం వెళ్ళేసరికి ఆ బంగ్లా పూర్తిగా నాశనమై పోయింది. రోడ్డు మీది జనమంతా అటు పరుగులు తీయటం ప్రారంభించారు.

అక్కడనుంచి న్యూ టౌన్ అనే ఏరియాకు వెళ్ళాడు షాడో. దర్బార్‌కి అక్కడ ఆరు అంతస్తుల అధునాతనమైన మేడ వుంది.

దాని ద్వారం ముందు యిద్దరు దృఢకాయులు నిలబడి వున్నారు. కారును రోడ్డు పక్కన ఆపి సూటిగా వారిని సమీపించాడు షాడో.

అతని వ్యవహారం వారికి అనుమానాన్ని కలిగించింది. "ఎవరది ?" అంటూ ముందుకు వచ్చారు.

రోడ్డు మీది జనానికి అనుమానం కలగకూడదు. అందువల్ల మిషన్ గన్‌ని వెనక్కి తిప్పి మెరుపులా దాడి చేశాడు షాడో. ఫట్ ఫట్ మంటూ కన్ను

మూసి కన్ను తెరిచేటంతలో వారిని పడగొట్టాడు. అడ్డదిడ్డంగా పడిపోయిన వారిద్దర్నీ మెట్ల మీద సాఫీగా పడుకోబెట్టి తలుపులు తోసుకొని లోపలికి పోయాడు.

పొడుగాటి కారిడార్ ప్రత్యక్షమయింది....దానికి రెండు వైపులా గదులు వున్నాయి..... అన్ని తలుపులు ఓరగా వేసి వున్నాయి. ఒక్కొక్కగదినే చూస్తూ ముందుకుపోయాడు షాడో.

ఉన్నట్లుండి.... అతనికి ఎడమ వైపున గది తలుపులు తెరుచుకున్నాయి. అందులోనుంచి నలుగురు వ్యక్తులు బయటికి వచ్చారు.

చటుక్కున కుడివైపున వున్న గదిలోకి గెంతాడు షాడో...... వాళ్ళేదో మాట్లాడుకుంటూ బయటికి పోయారు. మాటల రందిలో షాడోని గమనించలేదు.

వారు బయటికి పోగానే.... వేగంగా.... వారు బయలుదేరిన గదిలోకి వెళ్ళాడు షాడో. గదిలోకి అడుగుపెట్టిన మరుక్షణం... గుండెల్లో మూడు మూరల కత్తి ఒకటి దిగబడినట్లు అచేతనుడై నిలబడిపోయాడు.

ఆ గదిలో మధ్యగా ఒక టేబిల్ వుంది. దాని మీద పడి వుంది సోనీ. శరీరమంతా రక్తపు చారికలతో, అసహ్యకరంగా వుంది. నుదురు కాలి బొబ్బలెక్కి వున్నాయి. బుగ్గల మీద సూదులుతో గుచ్చినట్లున్నారు. ఎర్రటి రంధ్రాలు కనిపిస్తున్నాయి.

కడుపులో చేయి పెట్టి కెలికినట్లు అనుభూతి చెందాడు షాడో. వెచ్చటి కన్నీటి బొట్లు రెండు కనుచివరల నుంచి అతని బుగ్గల మీదికి జారాయి.

ఒక్క గంతులోకి పోయి టేబిల్‌ను సమీపించాడు.

సోనీ మరణించలేదు.... కాని మరణావస్థకు అతి సమీపంలో వుంది. షాడో కాలి వేళ్ళ దగ్గర్నుంచి బయలు దేరింది ఆవేశం. సోనీకి ఆ దశ పట్టించిన వారి అంతు చూడాలి.... గిరుక్కున వెను తిరిగాడు... అప్పుడే ద్వారం వద్ద కలకలం చెలరేగింది. పడిపోయిన వ్యక్తుల్ని చూసి, హడావుడిగా లోపలకు వున్నారు బయటకు వెళ్ళిన నలుగురూ.

షాడోని చూడగానే నిర్ఘాంతపోయారు. పళ్ళు కొరుకుతూ ఫాంటు జేబులోనుంచి హేండ్ బాంబు నొకదాన్ని తీశాడు షాడో. సేఫ్టీ పిన్‌ని లాగి వారి మీదికి విసిరేశాడు.

చెవులు చిల్లులుపడే శబ్దంతో పేలిపోయిందది. భవనపు ముఖద్వారం ముక్కలు ముక్కలై, భవనం భూకంపం వచ్చినట్లు కదిలిపోయింది. ఆ ప్రేలుడులో నామరూపాలు లేకుండా నాశనమై పోయారు నలుగురూ.

వెనుతిరిగి సోనీ దగ్గిరికి పోయాడు షాడో. అలాగే పడి వున్నదామె. ఆమె బంధాలను తొలగించి చంటి బిడ్డను ఎత్తుకున్నట్లు అతి జాగ్రత్తగా చేతులలోకి తీసుకున్నాడు.

సోనీ పెదిమలు అస్పష్టంగా కదిలాయి. వినబడీ వినబడనట్లు ఒక మాట షాడో చెవులకు చేరింది.

"రాజు ! ఎక్కడున్నావ్ ! రాజు".

ఉబికివస్తున్న కన్నీటిని అతి బలవంతంగా అదుముకొని బయటికి వచ్చాడు షాడో. రోడ్ మీద పెద్ద గుంపు చేరింది. కొంతమంది పోలీసులు భవనం ముందు తచ్చట్లాడుతున్నారు.

షాడోని చూసి ఎదురు వచ్చారు వారు. వారి ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా సోనీని కారు వెనుక సీటులో పడుకోబెట్టి కారును ముందుకు దూరించాడు షాడో. అడ్డురావడానికి ప్రయత్నించిన యిద్దరు పోలీసులు పక్కకు దూకారు.

వారి కేకలను, విజిల్స్‌ని లక్ష్య పెట్టకుండా, రెండు సందులు తిరిగి మళ్ళీ దర్బార్ మేడ వెనక్కి వచ్చాడు షాడో .

అతని ఆవేశం చల్లారలేదు. ... డిక్కీలో వున్న హేండ్ బాంబులను తీసి కారు బాయ్‌నెట్ మీద వరుసగా పెట్టాడు.

ఒకటొకటిగా సేఫ్టీ పిన్ లను బయటికి లాగి బలంగా మేడ మీదికి విసరటం ప్రారంభించాడు.

ప్రపంచ యుద్ధం ప్రారంభమయినట్లయింది. ఒక్కొక్క బాంబు పేలి.... ఒక్కొక్క అంతస్తు కిందికి కూలటం ప్రారంభించింది.

రాతిముక్కలు, కాంక్రీట్ అచ్చులు చెల్లా చెదరై.... పక్కనున్న భవనాలు కూడా స్వల్పంగా దెబ్బ తినసాగాయి.

రోడ్ మీది రాకపోకలు ఆగిపోయాయి. జనం చెల్లాచెదురుగా నలు దిక్కులకూ పరుగెత్తడం ప్రారంభించారు.

భవనం పూర్తిగా నేల మట్టం అయిన తర్వాతగాని షాడోని గమనించలేదెవరూ.... గమనించిన మరుక్షణం పోలీసు వాన్లు షాడోని వెంటాడటం మొదలు పెట్టాయి.

ఫియట్‌ని శరవేగంగా ముందుకు దూకించాడు షాడో. పది సందుల్లో ప్రవేశించి..... పోలీసులను ఏమార్చాడు. ఒక చోట చిన్న ప్రయివేట్ నర్సింగ్ హోమ్ కనిపించింది.

దానికి దూరంగా ఫియట్ ని ఆపి సోనీని చేతులమీద మోసుకుంటూ లోపలికి తీసుకుపోయాడు.

సోనీని చూసి నర్సింగ్ హోమ్ నడుపుతున్న లేడీ డాక్టర్ అదిరిపోయింది.

"మైగాడ్! ఏమిటి ? ఎందుకిలా అయింది?" అన్నది ఆశ్చర్యంగా.

ఫియట్ దగ్గిరికి పరుగుతీశాడు షాడో. ముందు సీటు కింద దాచివుంచాడు అంతకు ముందు దర్బార్ దగ్గిర్నుంచి కొల్లకొట్టిన పది లక్షల రూపాయలు విలువ చేసే బంగారపు అచ్చులున్న సంచీని.

దాన్ని తీసుకు వచ్చి డాక్టరు పాదాల ముందు పడవేశాడు.

"డాక్టరు.... సోనీని బ్రతికించండి. ఆమె ఎప్పటి మాదిరిగా నవ్వుతూ, తుళ్ళుతూ తిరిగేలా చేయండి.....కావాలంటే ఇంతకు రెట్టింపు డబ్బు యిస్తాను. దయచేసి సోనీ ప్రాణాలు కాపాడండి...." అన్నాడు గద్గద స్వరంతో.

సోనీ కదిలింది.... "రాజూ.... రాజూ....." అంటూ కలవరించసాగింది.

బయట పోలీస్ విజిల్స్ వినిపించటం ప్రారంభించాయి.

సోనీ వంక ఒకసారి చూసి డాక్టరుకి నమస్కరించి బయటకు పరుగు తీశాడు షాడో.

సడన్‌గా అతని మనస్సులో మరో భయం మొలకలు వేసింది. రాకీ, మాలినీలు క్షేమంగా వున్నారో,లేదో! తను చెప్పినట్లు ఎపార్టుమెంట్‌ని వదిలి మకాం మారిస్తే పరవాలేదు..... మార్చకపోతే!!

ఫియట్‌ని కదిలించి పక్క వీధిలోకి మలుపుతుండగా ఒక పోలీస్ వాన్ అటు వచ్చింది. ఫియట్‌ని చూడగానే వేగం హెచ్చించింది.

రెక్‌లెస్‌గా యాక్సిటర్‌ని తొక్కిపట్టాడు షాడో. గాలిలో ఎగురుతున్నట్లు పరుగులు తీయసాగింది ఫియట్. పది నిమిషాలలో సోనీ, రాకీ, మాలినిలు వుండే ఎపార్టుమెంట్ వున్న పేటలోకి ప్రవేశించింది.

ఎపార్టుమెంట్ దగ్గిరికి పోనవసరం లేకపోయింది. ఆ వీధినిండా పోలీసు వాన్లు నిలబడివున్నాయి. ఎపార్టుమెంట్ చుట్టూ హడావుడిగా తిరుగుతున్నారు పోలీసులు.

అయోమయంలో పడ్డాడు షాడో.

పోలీసులు యిక్కడికి ఎందుకు వచ్చారు? రాకీ పిలిపించిందా? లేక ఏమైనా గొడవ జరిగిందా?

ఒక సందు మధ్యలో ఫియట్‌ని వదిలి కాలినడకన ఎపార్టుమెంట్‌ని సమీపించాడు....హేండ్ కర్చిఫ్ తో ముఖం సరిగ్గా కనిపించకుండా జాగ్రత్తపడుతూ ఒక కానిస్టేబుల్‌ని కదిలించాడు.

తెల్లవారుఝామున ఏదో గొడవ జరిగిందని పక్కన వున్న నైబర్స్ రిపోర్టు చేశారట. ఇల్లు ఖాళీగా వుంది. లోపల పెద్ద పోట్లాట జరిగినట్లు ఫర్నిచర్ అంతా సమూలంగా నాశనమై వుందిట.

"ఎవరో ఆ కాలేజి అమ్మాయిలను కిడ్నాప్ చేశారు.... విచారణ చేస్తున్నాం." షాడో యిచ్చిన సిగిరెట్‌ని తీసుకొని వివరించాడా కానిస్టేబుల్.

షాడో కాళ్ళు చచ్చుబడిపోయినట్లయింది. అది దర్బార్ పనే! సందేహం లేదు. సోనీ చేత మాట్లాడించటం చేతకాక మిగిలిన యిద్దర్నీ పట్టుకున్నాడు. వారిని ఎరగా పెట్టి తన్ను ఎదిరించటానికి ప్రయత్నించవచ్చు.

షాడో మనస్సు వికలమై పోయింది.

రాకీ, మాలినీలు కూడా సోనీ మాదిరిగా తయారౌతూ వుండవచ్చు.

అందుకు కారకుడు తను. కామ్ గా వచ్చిన పనేదో గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేసుకొని పోకుండా వారికి ఆపదలు కొని తెచ్చాడు.

షాడో మనస్సు ఆలోచించటం మానివేసింది. ఆవేశం అతని నరనరాలకు వ్యాపించింది.

గిరుక్కున వెను తిరిగి ఫియట్ దగ్గిరికి వచ్చాడు . డిక్కీలో హేండు బాంబులు మరో యాభై వున్నాయి....నాటు మందు కూరిన వెదురుగొట్టాలు పాతిక వున్నాయి.

షాడో అలిగితే ఎలా వుంటుందో కిల్లర్స్ గాంగ్ కి చూపించాలి.!! పెదిమలు బిగించి దలైలా యిచ్చిన మూడవ అడ్రసుకు కారును పోనిచ్చాడు.

* * * *

పరాత్ ఘుట్టీ అనే చోట దర్బార్‌కి ఒక గెస్టు హవుస్ వున్నది. చుట్టూ పూలతోట స్విమ్మింగ్ పూల్. టెన్నిస్ కోర్టు, చాలా ఆడంబరంగా - అందంగా వుంటుందది.

ఫియట్‌ని సరాసరి పోర్టికోలోకి పోనిచ్చి కిందికి దిగాడు షాడో. అక్కడ ఎవరూ లేరు. గెస్ట్ హౌస్ నిర్మానుష్యంగా వుంది. రివాల్వర్ ని రెడీగా పట్టుకొని తోటలోకి పోయాడు షాడో.

ఒకచోట చెట్లకు పాదులు చేస్తున్న వృద్ధుడు కనిపించాడు. షాడోని చూడగానే చేస్తున్న పనిని వదిలి - పలుగును కర్రలా ఎత్తి పట్టుకుని మీదికి వచ్చాడు.

దగ్గిరికి రానిచ్చి ప్రక్కకు తప్పుకొన్నాడు షాడో. ఎడమ చేత్తో అతని భుజంమీద బలంగా చరిచాడు.

వృద్ధుడి చేయి చచ్చుబడి పోయినట్లయింది. చేతిలోని పలుగు జారి క్రింద పడింది. లాగి - అతని చెంప మీద కొట్టాడు షాడో. ఎగిరి నాలుగు అడుగులు వెనక్కి పోయి పడ్డాడతను.

రివాల్వర్‌ని బెల్టులోకి చేర్చి అతన్ని సమీపించాడు షాడో.

జుట్టు పట్టుకొని ఒక చెట్టు క్రిందికి లాక్కుపోయాడు.

"ఎంత కాలంనుంచి దర్బార్ దగ్గర పనిచేస్తున్నావ్ ?"

చెట్టు మొదలుకు ఆనించి కూర్చోపెడుతూ ప్రశ్నించాడు.

సమాధానం యివ్వలేదతను. ఖాండ్రించి షాడో ముఖం మీద వుమ్మేశాడు. చిన్నగా నవ్వాడు షాడో. అతని చొక్కాతో ముఖం మీద తడిని

తుడుచుకుంటూ చుట్టూ చూశాడు. అక్కడికి దగ్గిరలో మరో పెద్ద చెట్టు వుంది. దాని మొదట్లో పెద్ద చీమల పుట్ట వుంది . మామూలు చీమలు కావి, ఎర్ర చీమలు.

వృద్ధుణ్ణి కింద పడేసి యీడ్చుకుంటూ పుట్ట మీదికి లాక్కుపోయాడు షాడో. కదలకుండా చెట్టు మొదలుకు కట్టేశాడు. అతని ధోవతిని వూడతీసి.

అర్ధనగ్నంగా చీమల పుట్టమీద కూర్చున్నాడా వృద్ధుడు. అతని చొక్కాను వూడలాగాడు షాడో. దాన్ని వుండచుట్టి అతని నోటిలో కుక్కాడు.

డాగర్‌ని బయటకు తీసి అతనికి కనిపించేలా పదునును పరీక్షించసాగాడు.

అంత చలిలోనూ వృద్ధుడి శరీరం చమటలు పట్టింది. తల వూపుతూ తను మాట్లాడటానికి సిద్ధంగా వున్నట్లు తెలియచేసాడు.

నోట్లో వున్న చొక్కాను యివతలికి లాగాడు షాడో.

"నన్ను అవతలకు రానీయండి - - నీ ప్రశ్నలకు సమాధానం చెపుతా" అన్నాడు వృద్ధుడు.

కట్లు వూడతీసి యివతలకు రానిచ్చాడు షాడో. యివతలకు వచ్చిన మరుక్షణం పరుగు అందుకున్నాడు వృద్ధుడు. వెంటపడ్డాడు షాడో. అతను

పది అడుగులు కూడా పోకముందే పట్టుకున్నాడు. ఈ సారి స్విమ్మింగ్ పూల్ దగ్గిరికి లాక్కుపోయి కిందపడవేసి తలను నీటిలో ముంచాడు.

ఉక్కిరిబిక్కిరి అయ్యాడతను - - "చెప్తాను - - మీ ప్రశ్నలకు సమాధానాలు చెప్తాను." అని అరిచాడు హీన స్వరంతో.

ఈసారి వదలదలుచుకోలేదు షాడో. "సమాధానాలు చెపితే వదలుతాను." అన్నాడు.

సమాధానాలు యిచ్చాడు ఆ వృద్ధుడు. ఒకటొకటిగా దర్బార్ విషయాలన్నీ బయటికి వచ్చాయి.

దర్బార్ కి ఎక్కడెక్కడ ఆస్తులు వున్నాయో - - ఏమిటో అన్నీ చెప్పాడు. రెండు సినిమా థియేటర్లు, నాలుగు హోటళ్ళు, జనరల్ స్టోర్సులు, బట్టల కొట్లు మొదలైన వివరాలన్నీ బయటికి వచ్చాయి.

వృద్ధుడి ధోవతిని అతనికే యిచ్చి పారిపొమ్మన్నాడు షాడో. పోర్టికోలోకి వచ్చి ఫియట్‌ని రోడ్ మీదకు తీసుకుపోయాడు. డిక్కీ తెరిచి రెండు చేతి బాంబులతో బంగ్లా లోపలికి వచ్చాడు.

మొదటి బాంబుదెబ్బకి బంగ్లా తూనాతునకలై పోయింది. రెండవ బాంబు ప్రేలుడుకు స్విమ్మింగ్ పూల్ సర్వనాశనమయింది.

అక్కడి నుంచి విజృంభించాడు షాడో. ఫియట్‌ని శరవేగంగా సిటీ లోనికి పోనిచ్చాడు. థియేటర్సు దగ్గిర ఆపి.... నాలుగు చేతిబాంబులను పట్టుకొని లోనికి పోయాడు.

రెండు నిముషాలలో సర్వనాశనం అయిపోయాయి పక్కపక్కనే వున్న ఆ రెండు థియేటర్లూ.

ఒంటిగంటకు సిటీ మధ్యన వున్న దర్బార్ హోటల్ నేల మట్టం అయ్యింది. ప్రాణనష్టం ఏమీ లేదు. కాని ఆ భవనం మరి పనికిరాదు.

పదిహేను నిముషాల తరువాత దర్బార్ హోటల్ నేల మట్టం అయ్యింది. ప్రాణనష్టం ఏమీ లేదు. కాని ఆ భవనం మరి పనికిరాదు.

పదిహేను నిముషాల తరువాత దర్బార్ నాలుగవ అడ్రసు - - పెద్ద ఎయిర్ కండిషన్డు భవంతి - ముక్కలు ముక్కలై పోయింది. దర్బార్ అనుచరులు పాతికమంది ఆ ప్రేలుడులో ప్రాణాలు పోగొట్టుకున్నారు.

అరగంట తరువాత మరో రెండు జనరల్ స్టోర్సు మీద విరుచుకుపడ్డాడు షాడో. వెదురుగొట్టపు నాటు బంబులను వాటిల్లోకి విసిరి అక్కడి వారందర్నీ మట్టుపెట్టాడు.

ఆ తర్వాత కిల్లర్స్ గాంగ్ ప్రత్యేకంగా నడుపుతున్న పెద్ద బట్టలకొట్టు ఒకటి అకస్మాత్తుగా మంటలపాలైంది.

ఆ కొట్టు ముందు కారాపి ఒక పెట్రోలు డబ్బా పట్టుకొని లోపలికిపోయాడు షాడో.

లోపలవున్న కస్టమర్సుని ముందే హెచ్చరించాడు. అడ్డు వచ్చిన దర్బార్ అనుచరులను అదరగొట్టి పెట్రోల్‌ని నేలమీద వంపి లైటర్‌తో వెలిగించాడు.

దర్బార్ అనుచరులు కొనప్రాణాలతో బయటపడ్డారు.

కాంటాక్ నగరం దద్దరిల్లిపోయింది. నగరంలో వున్న పోలీసు బృందాలన్నీ షాడో కోసం వేట ప్రారంభించాయి.

ఒకచోట ఫియట్ ని వదిలి.... రోడ్ ప్రక్కనే ఉన్న మోటార్ బైక్ ని ఆక్రమించుకున్నాడు షాడో. దానిమీద శరవేగంతో పోయి కాంటాక్ రేడియో స్టేషన్‌లో దూరాడు.

అడ్డుపడబోయిన కాపలామనిషి తలమీద చిన్న దెబ్బ పడటంతో క్రోటన్స్ చాటున నిద్ర కుపక్రమించాడు.

ఠీవిగా స్టేషన్ లోపలికి వెళ్ళాడు షాడో. అతన్ని ఎవరూ అనుమానించలేదు. స్టూడియోలో మైక్ ముందు కూర్చుని వివిధ భారతి కార్యక్రమాన్ని రిలే చేస్తోంది ఒక ఉద్యోగిని.

సౌండ్ ప్రూఫ్ గది అది. నిశ్శబ్దంగా లోపలికి పోయి ఆమె నోరు మూసాడు షాడో. మెడమీద సున్నితంగా చరిచే సరికి ఆమె తల వ్రేలాడేసింది. ఆమెను మైక్ వున్న మెషిన్ వెనక పడుకోబెట్టి సీటులో కూర్చున్నాడు.

ఆ కార్యక్రమం తరువాత వార్తలు ప్రసారం అవుతాయి. కాంటాక్ పౌరులు అందరూ నగరంలో చెలరేగుతున్న భీభత్సాన్ని గురించి తెలుసుకోవడానికి రేడియో చుట్టూ మూగి వున్నారు.

కామ్‌గా వివిధ భారతి ప్రసారాన్ని ఆపి గొంతు సవరించుకున్నాడు షాడో.

కిల్లర్స్ గాంగ్ అనుచరులు... సోనీ మీద ఎటువంటి అత్యాచారాన్ని జరిపారో వివరించాడు. రాకీ, మాలినీలు కూడా అదే గతికి చేరుకోబోతున్న విషయం కూడా వెల్లడించాడు.

"సిక్కింలోని గొడవలకు మూల కారణం ఈ కిల్లర్స్ గాంగ్. దానిని సమూలంగా నాశనం చేయడం నా డ్యూటీ. కాని నా స్నేహితుల మీద చేయివేసి నన్ను అవమానించింది యీ కిల్లర్స్ గాంగ్. నా సహనం అంతరించింది. సిక్కింలో వున్న కిల్లర్స్ గాంగ్ నడుపుతున్న వ్యాపార కేంద్రాలన్నిటినీ భూస్థాపితం చేస్తాను. అమాయకులను పట్టి.... నన్ను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేయాలని ప్రయత్నించకండి. నాలోని మానవత్వం నశించింది. నా మూలముగా మరో అమాయక ప్రాణం

బాధపడిందంటే....ప్రపంచంలో ఒక్క కిల్లర్స్ గాంగ్ సభ్యుడూ ప్రాణాలతో వుండడు. ఎవరెవరు ఎక్కడ వుంటారో.... ఏం చేస్తుంటారో నాకు తెలుసు. వారందర్నీ వేటాడి చంపుతాను. సర్వనాశనం చేసి నా మూలంగా బాధలకు గురియైన వారి తరపున ప్రతీకారం చేస్తాను."

చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగనటువంటి ఆ వార్త క్షణాల మీద సిక్కిం అంతటా ప్రసారం అయింది. ఒక్క సిక్కిం కాదు... భారత దేశంలోని కొన్ని కేంద్రాలు ఆ వార్తను రిలే చేయటం సంభవించింది.

సిక్కిం అట్టుడికినట్లు అయిపోయింది. భారత ప్రభుత్వం వెంటనే మిలటరీకి ఆర్డర్లు జారీచేసింది.

నలుపు పాంటు, చిరిగిపోయిన తెలుపు షర్టు వేసుకున్న ఆరడుగుల ఆజానుబాహుడు ఎక్కడ కనిపించినా కాల్చి చంపమని ఆర్డర్లు జారీ చేయబడ్డాయి.

* * * *

రేడియో స్టేషన్ నుంచి చల్లగా బయటకు జారుకున్నాడు షాడో. సిటీలో ఏమూల చూసినా పోలీసులు ఎదురవటం గమనించి, సందుల వెంట ప్రయాణం చేసి సిటీ లిమిట్స్‌ని దాటాడు.

అప్పటికి సరిగ్గా సాయంత్రం మూడు గంటలు అయింది. మోటార్ బైక్‌ని ఒక చెట్టు క్రింద ఆపి సిగరెట్టు వెలిగించుకున్నాడు. పొగని గుండెల నిండా పీల్చుకుంటూ పరిస్థితిని అంచనా వేసుకున్నాడు.

తన ఎనౌన్స్‌మెంట్ దర్బార్‌కి అంది వుంటుంది. ఏ పని చేసినా కొంచెం ఆలోచించి చేస్తాడు. ఆ కాస్త వ్యవధిని తను వుపయోగించుకోవాలి. రాకీ, మాలినీలు ఎక్కడ వున్నారో తెలుసుకోవాలి.

ఉన్నట్లుండి ఆకాశంలో పెద్ద మోత వినిపించింది. తల పైకెత్తి చూశాడు. పది బాంబర్ విమానాలు కాంటాక్ నగరం మీద రౌండ్లు కొడుతున్నాయి.

షాడో కిల్లర్స్ గాంగ్‌ని ఎదిరించటానికి సిక్కిం చేరుకున్నాడని ప్రభుత్వానికి తెలుసు. కాని సి.బి.ఐ. అనేది దేశ శాంతిభద్రతల దృష్ట్యా బయట చెప్పుకోవటానికి వీలు లేని సంస్థ అయింది. దాని ఏజంట్లు పట్టుబడితే శిక్షలు అనుభవించవలసి వస్తుంది.

సిక్కిం రాజ్యాధికారులు చేసిన విజ్ఞప్తిని అనుసరించి షాడోను దేశ ద్రోహిగా పరిగణించి మిలటరీకి ఆర్డర్లను జారీ చేసింది భారత ప్రభుత్వం . హెలికాప్టర్లు స్పెషల్‌ట్రూప్స్ ని కాంటాక్‌లో దింపుతున్నాయి.

కానీ - - షాడో చూసిన బాంబర్ విమానాలు అటువంటి పనులకు ఉద్దేశించబడినవి కావు.

అవి పయనించే విధానమే విచిత్రంగా వుంది. సాయం సమయంలో గూళ్ళకు చేరుకొంటున్న కొంగలు అలాగే 'వి' ఆకారంలో ప్రయాణిస్తాయి.

సి.బి.ఐ. అత్యవసర పరిస్థితుల్లో - - తన ఏజంట్లను కాంటాక్ట్ చేయటానికి ఉపయోగించే గుర్తు అది. ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా, వెంటనే హెడ్‌క్వార్టర్సుని కాంటాక్టు చేయమని షాడోకి ఆర్డర్సు అందిస్తున్నాయా విమానాలు.

చీకటిపడేదాకా ఆగాడు షాడో. చీకటి మాటున మళ్ళీ నగర ప్రవేశం చేశాడు. ఒక పబ్లిక్ కాల్ ఆఫీసులోకి పోయి ఢిల్లీకి ట్రంక్ కాల్ బుక్ చేశాడు.

లైన్స్‌నన్నిటినీ క్లియరుగా వుంచింది సి.బి.ఐ. అందు వల్ల వెంటనే కనెక్షన్ వచ్చింది.

"హల్లో !" అన్నాడు షాడో.

"రాజూ ! నీ కసలు మతి వుందా ! " ఆవేశంతో జీరపడింది కులకర్ణి గారి కంఠం.

షాడో సమాధానం యివ్వలేదు. అలాంటి మాటలు వినవలసి వస్తుందనే అనుకుంటున్నాడు. అలాగే అయింది.

"నువ్వు చేస్తున్న దేమిటో అర్థం అవుతున్నదా? నీ కోసం.... కనిపించిన వెంటనే కాల్చి చంపమని పద్దెనిమిది వేల మంది పోలీసులకు

ఆర్డర్సు జారీచేయబడ్డాయి. ముప్పై వేలమంది సైనికులు కాంటాక్‌లో దిగుతున్నారు. వీళ్ళని తప్పించుకుంటూ నువ్వు చేయబోయేదేమిటి? అసలు ఆ ఎనౌన్స్‌మెంటు ఏమిటి? నీకు పిచ్చి ఎక్కిందా?" రిసీవర్ పగిలి పోయేటట్లు అరిచారు కులకర్ణి

"సార్.... చావు బ్రతుకుల్లో వున్న నన్ను చంటి బిడ్డడిలా చూసి ఇరవై నాలుగు గంటలూ పక్కన వుండి సేవలు చేసి కాపాడారు సార్. అందుకు ప్రతిఫలం కిల్లర్స్ గాంగ్ చేతిలో చిత్రహింసలు.... ఎంతకాలం వీళ్ళ ఆటలు కొనసాగాలి? ఎప్పటికప్పుడు ఎవరో ఒక లీడర్‌ని చంపి ఆ ట్రబుల్ ని అంతం చేయటమే కాని వీళ్ళని పూర్తిగా నాశనం చేయటం లేదు మనం. ఈ సారి అలా కాదు సార్. నన్ను ఆపకండి - - ఈ దర్బార్ అంతు చూసిగాని వెను తిరగను."

"అయితే ఆ దర్బార్ వెంటపడకుండా సిటీలో గల్లంతు చేయటం దేనికి?"

"దర్బార్ బలాన్ని క్షీణింపచేయటానికి, అతన్ని ఆలోచనలో పెట్టి, రాకీ, మాలినిల మీద చేయివేయకుండా చూడటానికి."

"డామిట్ రాజు.... ఈ ఎస్సైన్‌మెంట్ చాలా గందరగోళం అయింది. వెంటనే ఢిల్లీ బయలుదేరు. కొంతకాలం ఆగి ఆ తర్వాత చూసుకుందాం."

"నథింగ్ డూయింగ్ సర్."

"రాజు !!" గద్దించారు కులకర్ణి

"సారీ సర్ - - " అంటూ రిసీవరు పెట్టేశాడు షాడో. నెమ్మదిగా బయటికి వచ్చి చీకట్లలో కలిసిపోయాడు.

* * * *

చీకటి మాటున కాంటాక్ సిటీ అంతా కలియ తిరిగాడు షాడో. దర్బార్ ఆచూకీ లభించలేదు.

పోలీసులు, సైనికులు వీధులన్నిటినీ కాపలా కాస్తున్నారు. కాంటాక్ నగరమంతా అత్యవసర పరిస్థితి ప్రకటించబడి, కర్ఫ్యూ విధించబడింది. దాదాపు వెయ్యి మంది పౌరులు జట్లు జట్లుగా పోలీసులకు సాయం చేస్తూ నగరంలో తిరుగుతున్నారు.

ఆ వెయ్యిమందిలో కనీసం ఐదువందల మంది కిల్లర్స్ గాంగ్‌కి చెందిన మనుష్యులు వుంటారని అంచనా వేశాడు షాడో. తనను మట్టుపెట్టనిదే మరో పని చూడకూడదని గాంగ్ పంతం పట్టినట్లుంది.

కాంటాక్ నగరాన్ని అల్లకల్లోలం చేయటం వల్ల ప్రయోజనం లేకపోయింది. పరిస్థితులు ఎలా వున్నవి అలాగే వున్నాయి. దర్బార్ మాయమయ్యాడు. అతనితో పాటు రాకీ, మాలినిలు కూడా మాయం అయ్యారు.

అయినా నిరుత్సాహపడకుండా - - పట్టిన పట్టును వదలకుండా పట్టణమంతా తిరుగుతూనే వున్నాడు షాడో. అతన్ని పట్టుకోవటానికి

ప్రయత్నిస్తున్న హీరోలకు - - తాము వెతుకుతున్న మనిషి తమ వెనుకనే వున్నాడన్న విషయం తెలియనే లేదు.

పదకొండు గంటలకు షాడో ప్రయత్నం ఫలించింది. కాంటాక్ మధ్యభాగం నుంచి ఒక బ్లూ అంబాసిడర్ కారు సిటి బయటికి బయలుదేరింది.

పహారా యిస్తున్న పోలీసులకు, సైనికులకు సమాధానాలు చెప్పుకుంటూ మెల్లగా పయనించాడా డ్రయివర్. అందువల్ల అతి సులభంగా షాడో కంటబడ్డాడు.

సందుల్లో ప్రయాణించి కారు కంటే ముందుగా సిటి లిమిట్స్ దాటాడు షాడో. ఒక బ్రిడ్జి మీద చేతికి అందిన బండరాళ్ళను గుట్టగా పోసి రోడ్డు పక్కన దాక్కున్నాడు.

పది నిముషాల తరువాత అంబాసిడర్ అక్కడికి వచ్చింది. రాళ్ళ గుట్టను చూసి మెల్లిగా రోడ్ పక్కకు వచ్చి ముందుకు పయనించవలసి వచ్చింది.

ఆ కాస్త వ్యవధిని వుపయోగించుకొని, కారు టాపు మీదికి ఎక్కాడు షాడో.

అరగంట ప్రయాణించింది. అంబాసిడర్ సిటీకి పది మైళ్ళ దూరంలో చిన్న కొండలోయలో వున్న గెస్ట్ హౌస్ ముందు ఆగింది.

వేసవి కాలంలో విపరీతమైన రష్‌గా వుంటుందది. మంచుపడే కాలంలో దాదాపు నిర్మా నుష్యంగా వుంటుంది.

కారు ఆగబోతున్న దని గ్రహించి క్రిందికి దూకేశాడు షాడో. కారును రోడ్ మీదే వుంచి గేటు తీసుకొని లోపలికి పోయాడు డ్రయివర్.

గెస్ట్ హౌస్ ముఖద్వారం ముందున్న లైటు వెలిగి ఆ ప్రదేశమంతా కాంతివంతం అయింది.

గేటుదాటి లోపలికి పోదామా వద్దా అని తటపటాయిస్తున్న షాడో కనిపించిన దృశ్యాన్ని చూసి ఆ ఆలోచనను విరమించుకున్నా డు.

గెస్ట్ హవుస్ చుట్టూ అనేకమంది ధృఢకాయులు కాపలా వున్నా రు. వారి చేతుల్లో బరువైన రైఫిల్సు వున్నా యి.

అరగంట తరువాత తిరిగి వచ్చాడు డ్రయివర్. ఆ వ్యవధిలో షాడోకు కావల్సిన సమాచారం లభించింది.

సిటినుంచి పారిపోయి గెస్ట్ హవుస్ కి వచ్చాడు దర్బార్. చుట్టూ అనుచరులను కాపలా వుంచుకొని అక్కడ తల దాచుకున్నా డు.

నిశ్శబ్దంగా కారు వెనుక సీటు కింద చేరి పడుకున్నాడు షాడో. అంబాసిడర్ వెను తిరిగి సిటీ వైపు బయలుదేరింది. సిటీలో పొజిషన్ ఎలా వుందో పర్సనల్‌గా చెప్పటానికి వచ్చాడా డ్రయివర్.

తిరిగి సిటీని సమీపిస్తుండగా కింద నుంచి లేచాడు షాడో. అతని రూపం రియర్ వ్యూ మిర్రర్ లో కనపడింది డ్రయివర్ కి. అదిరిపడి కారును ఆపాడు. అంతే! ఆ తర్వాత ఏమయిందో అతనికి తెలియదు. రివాల్వరుని వెనక్కి తిప్పి మెడ మీద మోదాడు షాడో. కట్టెలా పడిపోయిన శరీరాన్ని రోడ్డు పక్కకు దొర్లించి, కారులో సిటీలోకి వచ్చాడు.

మెయిన్ రోడ్ల మీదికి పోయే అవకాశం లేదు. ఏ మాత్రం అనుమానం వచ్చినా కారుతో సహా ముక్కలు ముక్కలు చేసేటట్లున్నారు ప్రజలు.

మళ్ళీ సందులను ఆశ్రయించక తప్పలేదు. అరగంట సేపు శ్రమ పడి మరొక్కసారి పొప్పట్ లాల్ సెకండ్ హేండ్ షాపు దగ్గిరికి వెళ్ళాడు.

గాఢ నిద్దురలో వున్నాడు పొప్పట్ లాల్. పది నిముషాల సేపు తలుపు తట్టి తట్టి విసుగుచెందాడు షాడో. కిటికీ ఊచలు వంచి లోనికి పోదామా అని ఆలోచిస్తుండగా "ఎవరది ?" అన్న కంఠం వినిపించింది లోపలనుంచి.

థేంక్ గాడ్ అనుకుంటూ మరోసారి తలుపు తట్టాడు.

నిద్రకళ్ళతో తలుపు తెరిచాడు పొప్పట్ లాల్. షాడోని చూడగానే చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"రాజు సాబ్ ! మళ్ళీ మషాలా ఏమైనా అవసరం అయిందా? సాబ్ ! ఇంతవరకూ ఎందరికో నా మాషాలా అమ్మాను. మీలా వాటిని

వుపయోగించిన వాళ్ళని యింతవరకూ చూడలేదు." అన్నాడు లోపలికి తీసుకుపోతూ.

తనకు కావల్సిన మషాలా లిస్టు చదివాడు షాడో.

అండర్‌గ్రౌండ్‌కి దారి తీశాడు పొప్పట్ లాల్. చెక్కపెట్టెల్లో దాచిన సామానంతా తీసి ఒక గోతం సంచీలో మూటకట్టాడు.

వాటి ఖరీదు అంచనా వేశాడు షాడో. అంత డబ్బు అతని వద్ద లేదు. వాటికి ఏ చేయనని అంటే పొప్పట్ లాల్ చేయగలిగింది ఏమీ లేదు. కన్నంలో తేలుకుట్టిన దొంగలా మింగలేక కక్కలేక బాధపడతాడు.

కాని అతను గంగారాం స్నేహితుడు. గంగారామ్ షాడోకి ఆప్తమిత్రుడు.

"పొప్పట్ లాల్.... సిక్కింలో దేశద్రోహులు.... దొంగ వ్యాపారులు లేకుండా చేయాలని వచ్చాను నేను . నువ్వు చేసేది దొంగ వ్యాపారం, కాని నువ్వు నాకు ఆప్తుడివి. నా మాట వింటావనే ఆశిస్తున్నాను." అన్నాడు గంభీరంగా.

"చెప్పండి రాజు సాబ్ ! మీకు ఏం కావాలన్నా చేస్తాను. - - ఇంకా ఏమైనా కావాలా; ఆత్రుతగా అడిగాడు పొప్పట్ లాల్.

"నువ్వు యిచ్చిన సామాను ప్రస్తుతానికి చాలు. అది కాదు అసలు విషయం." అంటూ సాలోచనగా అతని వంక చూశాడు షాడో.

"పొప్పట్ లాల్ ! సిక్కింలో నువ్వు వ్యాపారం చేయకూడదు. రేపు తెల్లవారగానే నీ పెళ్ళాం పిల్లలతో ప్రయాణం కట్టు. గంగారామ్ దగ్గరికి పోయి నేను పంపించానని చెప్పు. నీ బ్రతుకు తెరువుకోసం న్యాయమైన వ్యాపారం చూపిస్తాడు."

రెండు క్షణాలు ఆలోచించాడు పొప్పట్ లాల్. షాడో మాట అతనికి నచ్చింది. "రాజు సాబ్.... ఈ క్షణంలో యీ వ్యాపారం మానేస్తాను. రెండు రోజులు వ్యవధి యివ్వండి. వెళ్ళిపోతాను - - అన్నట్లు మీకు డబ్బేమయినా కావాలా?" అంటూ అక్కడే వున్న ఇనుప పెట్టెవైపు అడుగులు వేశాడు.

నవ్వుతూ అతన్ని వారించి గోతం సంచీని భుజంమీద వేసుకున్నాడు షాడో. చాలా బరువు వున్నదది. అండర్‌గ్రౌండ్‌లో నుంచి బయటికి వచ్చేసరికి షాడో శరీరం చెమటలతో నిండిపోయింది.

గోతం సంచీని వెనుక సీటులోపడేసి కారును వెనక్కి తిప్పాడు షాడో. వచ్చిన దారినే జాగ్రత్తగా ప్రయాణించి సిటీ లిమిట్స్ దాటాడు.

అప్పటికి రెండు గంటలు అయింది టైం. ఆకాశంలో మిలటరీ విమానాలు తిరుగుతూనే వున్నాయి. పట్నంలో సైనికులు, పోలీసులు పహరా కాస్తూనే వున్నారు.

వారందరికీ కావల్సిన షాడో.... పగపట్టిన పాములా దర్బార్ సమీపంలోకి వెళ్ళనే వెళ్ళాడు.

* * * *

కారును గెస్ట్ హవుస్ కి రెండు వందల గజాల దూరంలో ఆపి కిందకి దిగాడు షాడో. గోతం సంచీలో మూటకట్టి వున్న ఒక నీలంరంగు సెకండ్ హేండ్ ఓవర్ కోటును వేసుకున్నాడు.

మంచు ప్రదేశాలలో గస్తీ తిరిగే కిల్లర్స్ గాంగ్ అనుచరులు అటువంటి కోట్లనే వాడతారు. ఆ కోటుకు లోపలి వైపు రెండు పెద్ద పెద్ద జేబులు వున్నాయి. గోతం సంచీలో వున్న అరడజను టైం బాంబులను ఆ జేబుల్లోకి తోసి.... మెల్లిగా గెస్ట్ హవుస్ ని సమీపించాడు.

చీకటిమాటున ఎవరికీ కనిపించకుండా గోడదూకి ఆవరణలోకి అడుగుపెట్టాడు.

గెస్ట్ హవుస్ కి ఎడమవైపున పెద్ద వరండా వుంది. దాని ముందు నిలబడి వుండటంవల్ల వారి అవయవాలు బిగదీసుకుపోతున్నట్లు..... వారి ఫోజులు చేస్తున్నాయి.

"మేరా నామ్ హై చంబేలీ...." అన్న హిందీ పాటను విజిల్ వేస్తూ అటు అడుగులు వేశాడు షాడో.

"హల్లో !" పలకరించాడొక వ్యక్తి.

"హల్లో.... వెధవ మంచు ప్రాణాలు తీసేస్తున్నది- -" విజల్ ఆపి సమాధానం యిచ్చాడు షాడో.

"నీ ఒక్కడి ప్రాణాలే కాదు - - మాపనీ అలాగే వుంది." గొణిగాడా వ్యక్తి.

"ఏం చేస్తాం తప్పదు.... యింకా ఎంతోసేపు వుండదులే యీ అవస్థ - - -" అంటూ ముందుకు పోయాడు షాడో.

"ఏమంటున్నాడు ?" ఇంకొక వ్యక్తి మొదటి మనిషిని అడిగాడు.

"ఇంకా ఎంతో సేపు వుండదీ బాధ అంటున్నాడు - - " సమాధానం ఇచ్చాడతను. ఏదో గొణుక్కున్నారందరూ. నవ్వుకుంటూ రెస్ట్ హవుస్ వెనక్కి పోయాడు షాడో.

కిల్లర్స్ గాంగ్‌లో వున్న పెద్ద లోపం అదొక్కటే. దాని అనుచరులు నానా జాతి సమితిలాంటివారు. ఎవరు ఎవరో ఎవరికీ తెలియదు.

రెస్ట్ హవుస్ వెనుక పెద్ద కిచెన్ వుంది. అందులో యిద్దరు వంటవాళ్ళు మరో యిద్దరు గాంగ్ అనుచరులు వున్నారు.

ద్వారం దగ్గిర నిలబడి సీరియస్ గా చూశాడు షాడో. గాంగ్ మనుష్యులు బయట కాపలా వుండవలిసిన వాళ్ళు. సందు చూసుకొని లోపలికి దూరి కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు.

షాడో తమవంక సీరియస్‌గా చూసేసరికి వారిలో తత్తరపాటు బయలు దేరింది.

"అయిపోయిందా మీ పని !" కరుకుగా అడిగాడు షాడో.

తలలు వంచుకొని బయటికి పరుగు తీశారు వారిద్దరూ. వంట వాళ్ళిద్దరూ స్టవ్ ల దగ్గిర చేరి ముఖాలు చాటు చేసుకున్నారు.

స్టవ్ ల మీద పెద్ద పెద్ద పాత్రలతో పాలు కాగుతున్నాయి. అది చూసి "వూరికే కబుర్లు చెప్పకపోతే బయట నిలబడి చలికి బిగుసుకుపోతున్న వాళ్లకు కాస్త కాఫీ సప్లయి చేయగూడదా! డండర్ హెడ్స్ - - పిగ్స్ - - " అరిచాడు షాడో.

రెండవసారి చెప్పవలసిన అవసరం లేకపోయింది. గబగబా కాఫీ కలిపి పెద్ద ఫ్లాస్కులో పోసుకుని.... బయటికి పరుగుతీశారు వారు.

టేబిల్ మీద ఒక గ్లాసు మిగిలిపోయింది. దానిలో పాలు వంచుకొని.... సిప్ చేస్తూ లోపలికి పోయాడు షాడో. కిచెన్ నుంచి ఒకదారి ముందున్న హాల్లోకి పోతుంది. ఆ హాల్లో మిషన్ గన్స్ పట్టుకున్న గాంగ్ మనుష్యులు శిలావిగ్రహాల్లా నిలబడి వున్నారు. వారి వద్ద తన పాచిక పారదని గ్రహించి వెనక్కి తగ్గాడు షాడో.

మేడమీది నుంచి పెద్ద పెద్ద అరుపులు వినిపిస్తున్నాయి. ఎవరో ఆవేశంగా మాట్లాడుతున్నారు. కొద్దిసేపు నిలబడి విన్నాడు షాడో. మొత్తం నాలుగు కంఠాలు వినవస్తున్నాయి - - ఏదో కాన్ఫరెన్స్ జరుగుతున్నట్లుంది.

వంట వాళ్ళిద్దరూ ఇంకా తిరిగి రాలేదు. ఓవర్ కోటులో దాచిన టైం బాంబులను తీసి హాలుకు పోయే దారిలో ఒక మూల, మేడకు పోయే దారిలో ఒక మూల, కిచెన్ లో రెండు చోట్ల అమర్చాడు షాడో.

రెస్ట్ హౌస్‌కి రెండవ వైపున ఒక చిన్న అవుట్ హౌస్ వున్నది. అందులో వంద కాండిల్స్ బల్బు వెలుగుతున్నది. దానికి పదిగజాల యివతల యిద్దరు వ్యక్తులు నిలబడి వున్నారు.

ఠీవిగా వారిని సమీపించాడు షాడో . అవుట్ అవుస్ లోని లైటు ముఖం మీద పడకుండా వెనక్కి తిరిగి నిలబడ్డాడు.

"కాఫీ పంపించింది నువ్వేనా ! చాలా థేంక్స్ - -"

"వెధవ డ్యూటీ - - చచ్చిపోతున్నా - - " అందుకున్నాడు రెండవ వ్యక్తి.

షాడో గుండెలు శరవేగంగా కొట్టుకుంటున్నాయి. - - అతి ప్రయత్నంమీద వాచివంక చూడాలన్న కోరికను నిగ్రహించుకున్నాడు.

రాకీ, మాలిని ఎక్కడ వున్నారు? పదినిముషాలలో వారిని బయటకు తీసుకురాకపోతే భవనంతో పాటు వారుకూడా పేలిపోతారు.

"ఇక్కడ ఈ లైటు దేనికి అనవసరంగా ?" బొటనవేలితో అవుట్ హవుస్ వైపు చూపిస్తూ గుర్రుగా అడిగాడు.

చిన్నగా నవ్వాడొక వ్యక్తి. "అదీ- - పిట్టలు బయపడకుండా వేసివుంచాం.... దర్బార్ కోసం జాగ్రత్తగా కాపాడుతున్నాం...." అన్నాడు రెండోవ వ్యక్తి.

షాడో మనస్సు కొంచెం విశ్రాంతిని పొందింది.

"ఎలా వున్నాయవి? బాగున్నాయా?" అన్నాడు కాజువల్‌గా.

"నెంబర్ వన్ ! అసలు ఆడవాళ్ళలో అంత అందం గలవాళ్ళు వుంటారని నాకు తెలియదు." పెదిమలు చప్పరిస్తూ నవ్వాడా వ్యక్తి.

అలాగే నిలబడి ఒకట్లు లెక్కబెట్టసాగాడు షాడో - - ఐదు నిముషాల తరువాత టప్ మని చిన్న శబ్దం వినవచ్చింది.

మొదటి బాంబు అది. చాలా చిన్నది. దాని గెస్ట్ హవుస్ కి కరెంటును సప్లయి చేసే మెయిన్ కింద పెట్టాడు షాడో. మెయిన్ మాత్రం ఎగిరిపోయింది: గెస్ట్ హవుస్ ని అంధకారం ఆవరించుకుంది.

"మైగాడ్ ! ఏమయింది? ఆదుర్దాగా అన్నాడొకడు.

"మెయిన్ పాడయి పోయినట్లుంది !" అప్పటికే వెనక్కు జరగటం ప్రారంభించిన షాడో మెల్లిగా అన్నాడు.

అప్పుడే మరో శబ్దం వినవచ్చింది. ఈ సారి ఆ మోతకు ఆ చుట్టుపట్ల వున్న పర్వతాలు అదిరిపోయాయి.

హాలుకు పోయేదారిలో వున్న బాంబుఅది. దాని ప్రేలుడుకు హాలు నామరూపాలు లేకుండా నాశనమైపోయింది. రెస్ట్ హవుస్ ముందు భాగం కూలిపోయింది.

ఆ ప్రేలుడును అనుసరించి మరొకటి వినవచ్చింది. గెస్ట్ హవుస్ ముందు భాగం కూలిపోయింది.

ఆ పైన ఆ ప్రదేశాన్ని ఆవరించుకుని వున్న ప్రశాంతత గాలికి ఎగిరిపోయింది కేకలతో. అరుపులతో, ఏడుపులతో మార్మోగిపోయింది ఆ లోయ.

మంటలు ప్రత్యక్షమయ్యాయి గెస్ట్ హవుస్ వున్న చోట. ఎవరో "నీళ్ళు - నీళ్ళు" అని అరుస్తున్నారు.

జేబులోనుంచి లైటర్ తీసి వెలిగించాడు షాడో.

ఒక మూలగా పడివున్నారు రాకీ, మాలినిలు. కాళ్ళు చేతులు బంధింపబడి వున్నాయి.

బూటులో వున్న డాగర్‌ని తీసి వారి బంధాలను తొలగించాడు షాడో. ఇద్దర్నీ భుజాలమీద వేసుకొని బయటికి పరిగెత్తుకొచ్చాడు.

కొద్దిసేపు విడిపించుకోవాలని గింజుకున్నారు వారిద్దరూ. నచ్చచెప్పే అవకాశం లేదు.

"నోరు మూస్తారా, పిర్రలు పగలగొట్టాలా?" ప్రహరీ గోడవైపు పరుగులు తీస్తూ కోపంగా అన్నాడు షాడో.

వెంటనే గుర్తు పట్టారు వారిద్దరూ. నాలుగు చేతులు షాడో మెడను కౌగిలించుకున్నాయి. నాలుగు పెదిమలు అతని బుగ్గల్ని స్పృశించాయి.

"రాజూ - - వచ్చావా - - మాకు తెలుసు నువ్వు వస్తావని, మాకు తెలుసు రాజూ" ఆనందం, విషాదం మేళవించిన రెండు కంఠాలు అతని చెవుల్లో గొణిగాయి.

ఇద్దర్నీ గోడమీదినుంచి అవతలికి దొర్లించి తనుగూడా గోడమీదినుంచి కిందికి దొర్లాడు షాడో. తాచుపాములు చుట్టలు చుట్టుకున్నట్లు షాడో చుట్టూ చుట్టుకున్నారు రాకీ, మాలినిలు.

కురుస్తున్న మంచును లక్ష్యపెట్టకుండా - - నాలుకలు చాస్తూ చెలరేగాయి మంటలు. మంటల్లో పడిన కిల్లర్ గాంగ్ వారి ఆయుధాలు టపాకాయల్లా టపటప లాడుతున్నాయి. చిటపటలాడుతూ గాలిలోకి ఎగిరిన బుల్లెట్లు - - గాంగ్ అనుచరులను మరింత ఖంగారు పెడుతున్నాయి. ఖంగారుపడుతూ, పిచ్చిగా అరుస్తూ తలా ఒక దిక్కుకూ పరుగులు తీస్తున్నారు వారందరూ. వారెవరికీ ఏమీ తోచటం లేదు. ఏం చెయ్యాలో అర్థం కావటంలేదు.

రాకీ, మాలినిలను సముదాయించి , దూరంగా తీసుకు పోయాడు షాడో. రోడ్డుకు దూరంగా వున్న ఒక బండ రాతి చాటున కూర్చోపెట్టి అక్కడినుంచి కదలవద్దని హెచ్చరించి మళ్ళీ కారు ఆపిన ప్రదేశానికి బయలుదేరాడు.

"మేమూ వస్తాం రాజు! మాకు భయంగా వున్నది" షాడో చేతిని కౌగలించుకొని అడ్డుపడింది మాలిని.

సీరియస్‌గా చూసి తల అడ్డం తిప్పాడు షాడో. రివెంజింగ్ బిజినెస్ అయిపోయింది. దర్బార్ అనుచరులను కూడా నాశనం చేసేస్తే తను వచ్చిన పని పూర్తి అయిపోయినట్లే . ఆ పని - - రాకీ, మాలిని చూడకూడదు, చూడలేరు కూడా.

బండరాయిని వదిలి కదిలి ఒక్క అడుగు కూడా పక్కకు రావద్దని వారిద్దరికీ మరోసారి గట్టిగా చెప్పి కారు దగ్గిరికి వచ్చాడు.

గోతం సంచీని కిందికి లాగి, రోడ్డు మీద పడేసి ఈడ్చుకుంటూ రెస్ట్ హౌస్ కి వంద గజాల దూరంలో వున్న చిన్న గుట్ట చాటుకు పోయాడు.

గోతం సంచీలో ఒక మెషిన్ గన్ వుంది. దాన్ని తీసి స్టాండ్ సరిచేసి గుట్ట పక్కన నిలబెట్టాడు.

తరువాత ఆఖరి ఆయుధాన్ని బయటికి తీసి రెడీ చేశాడు. నాలుగు అడుగులు పొడవున్న రాకెట్లను వేసి గాలిలోకి పేలుస్తారు. ఆ రాకెట్లు సూటిగా కిందికి దిగి టార్గెట్స్ మీద పడతాయి.

ఆవరణలోని వారందరూ ఒక చోట గుమికూడి..... కలిసికట్టుగా బయటికి రావటానికి ప్రయత్నిస్తున్నారు.

మెషిన్ గన్‌తో ఫైరింగ్ ఓపెన్ చేశాడు షాడో. ద్వారం దగ్గరికి వచ్చిన వారందరూ భయపడి వెనక్కి పరుగు తీశారు.

వెంటనే బజూకాలో ఒక రాకెట్టుని పెట్టి....మీట నొక్కాడు షాడో. బజ్‌జ్ మని శబ్దం చేస్తూ గాలిలోకి లేచిందది. సూటిగా పోయి భవనం మీద పడింది.

మరోసారి చెవులు చిల్లులుపడే శబ్దం - - ఆ ప్రదేశంలో ప్రతిధ్వనించింది. కూలిపోయిన భవనం తాలూకు రాతి ముక్కలు గాలిలోకి ఎగిరాయి.

ఒకదాని తరువాత ఒకటిగా రాకెట్లను వదిలాడు షాడో. గెస్ట్ హౌస్ నామరూపాలు లేకూండా పోయింది.

మెషిన్ గన్‌లో వున్న బుల్లెట్స్ నన్నిటినీ ఖాళీ చేసి బజూకాతో కారు దగ్గరికి పరుగు తీశాడు షాడో. రాకీ, మాలినిలను పిలిచి వెనుక సీటులో కూర్చోబెట్టుకుని కారు వెనక్కి తిప్పాడు.

సిటీ లిమిట్స్‌ను దాటే ప్రదేశంలో, రోడ్డు క్రిందికి పోనిచ్చి ఒక చెట్టు చాటున ఆపాడు కారుని. బజూకాని కారు పక్కన నిలబెట్టి రెండు రాకెట్లను లోడ్ చేసి ఎదురు చూడటం ప్రారంభించాడు.

* * * *

రక్తసిక్తమైన శరీరంతో తూలుతూ ఆవరణలో నిలబడి వున్నాడు దర్బార్. ఏం జరిగిందో, ఎలా జరిగిందో అతనికి అర్థం కాకుండా పోయింది.

కాని జరిగిన దానికి షాడోనే కారకుడు అని అతనికి అర్థం అయింది. షాడో ఒక్కడే అంత దారుణాన్ని సృష్టించగలడు. మనిషి కాదతడు. పిశాచి.... బ్రహ్మ రాక్షసుడు.

ఎవరో పేరు తెలియని అనుచరుడొకడు వచ్చి.... దర్బార్ కిందపడిపోకుండా సాయంచేసి నిలబెట్టి పట్టుకున్నాడు.

అదే సమయంలో షాడో వదిలిన బజూకా రాకెట్లు గెస్ట్ హౌస్ మీదికి దిగటం ప్రారంభించాయి. దర్బార్ కళ్ళముందే అది నేల మట్టం అయింది. దానితో పాటు అతని సహచరులు - - గాంగ్‌లో అతి ముఖ్యులయిన నలుగురు వ్యక్తులు భూస్థాపితం అయ్యారు. వారి సహాయం వల్లనే అంతవాడైనాడు దర్బార్.

పెద్దగా ఏడ్వాలని అనిపించింది అతనికి. ఏమీ చేయలేక ఆవేశం తెచ్చుకొన్నాడు - - "ఎక్కడ ! ఆ పిట్టలు రెండూ ఎక్కడ? ఇటు తీసుకురండి

- - సజీవంగా పాతిపెట్టి షాడో గాడికి నా సత్తా చూపిస్తాను. ఆ పిట్టల్ని యిటు తీసుకురండి.” అని అరవటం ప్రారంభించాడు.

"ఆవేశపడకండి సార్ ! మీ పరిస్థితి ఏమీ బాగోలేదు” లాలించాడు ఒక అనుచరుడు.

"ఇంకెక్కడి పిట్టలు సార్ ! అవి ఎప్పుడో షాడోతో పాటు ఎగిరిపోయాయి” అందించాడు మరొక అనుచరుడు.

"నో.....నో.... అలా జరగడానికి వీలు లేదు.... ఆ పిట్టల్ని తీసుకు రండి....” పిచ్చిగా అరిచి చిందులు వేశాడు దర్బార్.

అతని అనుచరులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

షాడో రాకెట్లను వదలటం ఆపగానే - గందరగోళం కొంచెం సద్దుమణిగింది. ప్రాణాలు దక్కించుకున్న పదిమంది అనుచరులు....గెస్టుహౌస్ వెనుక నిలబెట్టిన కార్లను రోడ్డు మీదికి తీసుకువచ్చారు.

ముందు కారులో దర్బార్‌ని కూర్చోబెట్టి మెల్లిగా సిటీ వైపు బయలుదేరారు.

నవ్వటం ప్రారంభించాడు దర్బార్.... “యస్. తను.... ది గ్రేట్ కిల్లర్స్ గాంగ్ ఆర్గనైజర్. సిక్కింలో ఎక్కడా లేనటువంటి గొడవలను సృష్టించి

ప్రభుత్వాలను తారుమారు చేసిన దర్బార్.... ఏమయింది? ఎందుకిలా జరిగింది? హల్లో డియర్ దలైలా... నువ్వు నా అనుచరుడివి.... నేను..... చెప్పినట్లు చేయడం నీ విధి. షాడోను హతమార్చు. రేపు చీకటిపడేలోగా షాడో తల తెచ్చి నాకు చూపించు."

"ఓహ్ ! భగవాన్.... నన్ను క్షమించు.... నా జోలికి షాడో రాకుండా చేస్తే చాలు. ఇంకేమి అడగను.... భగవాన్.... షాడోమీద ఒక ఆటంబాంబ్ పడితే బాగుంటుంది."

సీటు మీద తల వాల్చుకొని వెక్కివెక్కి ఏడ్వటం ప్రారంభించాడు దర్బార్.

* * * *

వస్తున్న కార్లను లెక్కపెట్టాడు షాడో. ఒకటి రెండు మూడు.... నాలుగు! మొత్తం నాలుగు కార్లు వస్తున్నాయి. అంతా అయిపోయిందని అనుకుంటున్నారు వాళ్ళు. అప్పుడే ఎక్కడ అయింది?

రెండే రెండు రాకెట్లు వున్నాయి బజూకాలో మరో రెండు చేతి బాంబులు వున్నాయి. అంతే! వాటితోనే పని పూర్తిచేయాలని నిశ్చయించుకొని బజూకాను గట్టిగా పట్టుకున్నాడు షాడో.

ముందు కారు రేంజిలోకి వచ్చింది. అందులో నుంచి ఎవరిదో నవ్వు వినవస్తోంది. షాడో శరీరం జలదరించింది. కళ్ళ ముందు సోనీ మెదిలింది.

పళ్ళు కొరుకుతూ మొదటి రాకెట్‌ని వదిలాడు. సూటిగా పోయి కారు బాయ్‌నెట్ మీద పడిందది. పెద్ద శబ్దంతో ముక్కలైంది. కారు రెండుగా విచ్చిపోయింది.

వెంటనే రెండవ రాకెట్‌ని పైకి పంపించాడు షాడో. ఆఖరి కారు అంతూ పొంతూ లేకుండా పోయింది.

హేండ్ బాంబులను మధ్యలో వున్న రెండు కార్ల మీదా విసిరాడు. రోడ్డు కిందికి దొర్లాయా కార్లు.... వాటిలోని వ్యక్తులు పెద్దగా అరుస్తూ కిందికి దూకి చీకట్లోకి పారిపోయారు.

దారుణమైన నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకొంది.

బజూకాను వదిలి నిరారుగా లేచి నిలబడ్డాడు షాడో. యస్ . ఇప్పుడు అయిపోయింది. దర్బార్ సృష్టించుకున్న భూతల స్వర్గం సమూలంగా నాశనమైపోయింది. సిక్కింలో కిల్లర్స్ గాంగ్ మళ్ళీ పాతుకోవటానికి - - ఎలా లేదన్నా మరో పది సంవత్సరాలు పడుతుంది.

అప్పుడు మళ్ళీ తనే రావచ్చు.... ఒక వేళ తను లేకపోవటం అంటూ సంభవిస్తే యింకో షాడో తప్పకుండా వస్తాడు.

పాపం అనేది ఎంతోకాలం జీవించదు. భగవంతుడి ఓర్పుకు ఒక హద్దు వుంటుంది. అది నశించిన రోజున యిదుగో..... యిలాంటి ఫలితాలే కానవస్తాయి. కిల్లర్స్ గాంగ్ పాపం పండబట్టే సోనీ, రాకీ, మాలినిల మీద

చేతులు వేశారు. ఆ పని చేయకపోతే షాడో అంత ఆవేశపడేవాడు కాదు. దర్బార్ లాంటి ముఖ్యుల సంగతి చూసుకొని వెనుతిరిగేవాడు. ఇప్పుడు అలా కాదు. అసలు కిల్లర్సుగాంగ్ అనే మాటే కాంటాక్‌లో కనిపించకుండా పోయింది.

యా! మానవుడు ఒకటి అనుకుంటే దేవుడు మరొకటి చేస్తాడు!!

* * * *

వారం రోజులు రాకీ, మాలినిలతో కాంటాక్ చుట్టుపట్ల తిరుగుతూ కాలక్షేపం చేశాడు షాడో.

గెస్ట్ హౌస్ దగ్గరి మారణహోమం సిక్కిం దేశాన్ని కలవరపర్చింది. మరో లక్షమంది భారతీయ సైనికులు కాంటాక్‌లో దిగారు. నగరమంతా అష్టదిగ్బంధనం చేసినట్లు కాపలా కాయటం ప్రారంభించారు.

వారు కాపలా కాస్తుండగా నగరంలోకి పోవటానికి మనస్కరించక చెట్లూ పుట్టలు పట్టుకు తిరిగాడు షాడో. తను వచ్చిన పని అయిపోయింది. తనకు సహాయం చేసిన వారు క్షేమంగా వున్నారు. అది చాలు. అనవసరమైన రిస్కులు ఆపైన తీసుకోకూడదు.

వారం రోజుల తర్వాత కొత్త సంఘటనలు ఏవీ జరుగకపోవటంతో పట్టణంలో ప్రశాంతత ఆవరించింది. సైనికుల కాపలా కొంచెం సన్నగిల్లింది.

సందు చూసుకొని కాంటాక్ ప్రవేశం చేశాడు షాడో. సరాసరి సోనీని వదిలిన నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాడు.

సోనీ కులాసాగా వున్న ది. ఆమె గాయాలు పూర్తిగా మానకపోయినా మానుబట్టటం ప్రారంభించాయి.

షాడోను చూడగానే తను గూడా అతనితో వస్తానని మంకుపట్టు పట్టిందామె. విధిలేక డాక్టర్‌కి కూడా చెప్ప కుండా ఆమెను నగరం దాటించాడు షాడో.

నగరం వెలుపల ఒక పాడుపడిన పూరింట్లో రాకీ, సోనీ, మాలినిలతో కాపరం ప్రారంభించాడు.

సోనీ పూర్తిగా కోలుకోవటానికి నెలరోజులు పట్టింది. ఆ నెల రోజులు ఆమె మంచం పక్క నే కూర్చు ని సేవలు చేశాడు షాడో.

కాంటాక్‌లో పూర్తిగా ప్రశాంతత ఆవరించింది. మిలటరీ వుపసంహరింపబడింది.

షాడో కోసం వేట విరమించారు సైనికులు, పోలీసులు మాత్రం పట్టువదలకుండా వెతుకుతూనే వున్నా రు.

వారే కాదు సి.బి.ఐ. కూడా షాడో కోసం అన్వేషణ ప్రారంభించింది.

"ఆ బ్లడీ రాస్కెల్ ఎక్కడ వున్నా కాళ్ళు చేతులు విరగగొట్టి తీసుకురండి. పంపిన పనిని సర్వనాశనం చేయటం కాకుండా.... పని పూర్తి చేసి వచ్చి రిపోర్టు చేయ కుండా షికార్లు కొడుతున్నాడు. ఐ వాన్ట్ దట్ అగ్లీ మంకీ....

ఐ వాన్ట్ హిమ్ నౌ...." అంటూ కారాలు మిరియాలు నూరుతున్నారు కులకర్ణి.

సి.బి.ఐ. సెక్యూరిటి స్టాఫ్ అంతా షాడో కోసం వెతకటం మొదలు పెట్టింది. ముఖేష్, శ్రీకర్‌లు బయలుదేరారు.

రెండు నెలలు గడిచినా షాడో జాడ తెలియలేదు.

వెతకటానికి పోయిన ముఖేష్, శ్రీకర్, సెక్యూరిటీ కాప్టన్ వాసు అయిపూ అంతూ లేకుండా మాయం అయ్యారు.

రెండు రోజులు చూసి - బిందుకు ఫోన్ చేశారు కులకర్ణి. ఆమె కూడా అవుటాఫ్ స్టేషన్.

అప్పుడు ఆయన మెదడు పనిచేసింది. సెక్రటరీ సులోచనతో కాంటాక్ బయలుదేరాడు.

నగరాన్ని సమీపిస్తుండగా - నగరం వెలుపల ఒక పాడుపడిన పూరిల్లు ఆయనకు విమానంలో నుంచే కనిపించింది. అసలు అటువంటి వాటి కోసమే చూస్తున్నా రాయన.

పూరింటి ముందు కూర్చుని - నలుగురు యువతులు - నలుగురు యువకులు ప్లేయింగ్ కార్డ్స్ ఆడుతున్నా రు - దీక్షగా.

"బ్లడీ రోగ్స్ - వీళ్ళని ఏం చేయాలి ? పక్కనే వున్న సులోచనతో అన్నా రాయన.

ఆమె సమాధానం యివ్వలేదు. విమానం ఎప్పుడు నేలకు దిగుతుందా - తనుగూడా పోయి వారితో చేరుకుందామా - అని ఎదురుచూస్తోంది.

- - : జైహింద్ :- -


Dirty Devils
MADHU BABU